జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :232 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 ၊ సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 ၊ చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## వివేకా హత్య కేసులో

# ఈడీ దూకుడు

- రూ.40 కోట్ల డీల్‌పై దస్తగిరికి ప్రశ్నల వర్షం
- వివేకా హత్య కేసులో ముగిసిన దస్తగిరి ఈడీ విచారణ
- దస్తగిరిని 7 గంటలపాటు ప్రశ్నించిన ఈడీ అధికారులు
- వివేకా హత్య కేసులో జరిగిన రూ.40 కోట్ల డీల్‌పై దస్తగిరిని ప్రశ్నించిన ఈడీ



**అమరావతి**

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారించింది. నేడు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన దస్తగిరిని అధికారులు 7 గంటలపాటు ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో జరిగిన 40 కోట్ల రూపాయల డీల్‌పై అధికారులు విచారించారు. ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దస్తగిరి మధ్య జరిగిన ఒప్పందంపైనా ఆరా తీశారు. తనకు 5 కోట్ల రూపాయలు ఇస్తామని గతంలో సీబీఐకి దస్తగిరి వెల్లడించాడు. అప్పట్లో దస్తగిరి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ - మిగతా3లో



## యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

- బీజేపీపై రాహుల్‌గాంధీ ఫైర్
- బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన
- పోలీసుల చర్యల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారని రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- యువత గొంతును అణచివేసే ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పక తప్పదని హెచ్చరిక

## అమరావతి సంగమం నిర్మాణానికి

# 759.79 కోట్లు



- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే
- 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు
- అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ
- స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో 'అమరావతి సంగమం' నిర్మాణం
- కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ

**అమరావతి**

31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం - మిగతా3లో



## క్లీన్ ఎనర్జీ, కీలక ఖనిజాలపై దృష్టి

- ఘర్షణలకు చర్చలు, దౌత్యమే మార్గం'
- భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు
- ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలన్న ప్రధాని మోదీ.. బెల్జియం మధ్య కీలక ఒప్పందాలు

## అక్టోబరు నుంచి

# కొత్త పింఛన్లు

- ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు
- తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్
- కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం
- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం



**అమరావతి**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా - మిగతా3లో

## వన్య ప్రాణుల మరణాలపై

# సమగ్ర అధ్యయనం

- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలి
- వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలి



**అమరావతి**

వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవల చోటు చేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పులుల మరణాలపై అధ్యయనానికి అటవీశాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఆ బాధ్యతలను అప్పగించారు. వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ--వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు అమలు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత హనుమాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక బందాలను రంగంలోకి దించి, ప్రత్యేక పరిస్థితుల్లోనూ జంతువుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, వాటి ఫలితాలను - మిగతా3లో




## అమెరికాతో ట్రేడ్ డీల్‌పై

# భారత్ కీలక షరతు

- మన వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తేనే!
- పోటీ దేశాల కంటే భారత్‌కు మెరుగైన టారిఫ్ రేట్లు ఇవ్వాలని అమెరికాకు స్పష్టం
- అనుకూల నిబంధనలు ఖరారైన వెంటనే బీటీఏ తుది వివరాలు ప్రకటిస్తామని పీయూశ్ గోయల్ వెల్లడి

## రాహుల్‌పై ఎన్ని ఎఫ్ఐఆర్ పెట్టినా భయపడేది లేదు



- హల్ద్వానీ ర్యాలీ ప్రాంగణంలో శుద్ధీకరణపై వివాదం
- దళితుల కోసం గొంతెత్తిన రాహుల్‌ను భయపెట్టేందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్న మల్లికార్జున ఖర్గే
- ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామంటూ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలు
- హల్ద్వానీ ఘటనను కేవలం శుద్ధీకరణగా చూడలేం
- "రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత. పార్లమెంట్‌లోనే కాకుండా బయట కూడా ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్నారు
- విద్యార్థులు, మహిళలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, దళితుల సమస్యలపై ప్రశ్నిస్తున్నారు.

# సంక్షేమం.. అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**లైదాంలో ఇంటింటా ప్రచారం, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం**

**రైతులకు పట్టాదారు పాస్ పుస్తకం ఎంతో కీలకమైనది**

**భూమిపై రైతుకు ఉన్న హక్కుకు ఇది ఒక ఆధారంగా నిలుస్తుంది : ఎమ్మెల్యే రవికుమార్**





**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్ :**కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఆమదాలవలస నియోజకవర్గంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని రాష్ట్ర పియుసి చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం నాడు పొందూరు మండలం లైదాం గ్రామంలో ఇంటింటి ప్రచారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్నామని అన్నారు.ప్రజల సమస్యలు ఇంటి వద్దే తెలుసుకుంటూ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకం ఎంతో కీలకమైన పత్రమని ,భూమిపై రైతుకు ఉన్న హక్కుకు ఇది ఆధారంగా నిలుస్తుందన్నారు. అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూమికి సంబంధించిన హక్కులు, రికార్డుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు రైతులు తమ భూ రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని ,పాస్‌పుస్తకాల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారు" అని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర ప్రజా అవసరాలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ఆమదాలవలస నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి" అని కూన రవికుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంత రామకృష్ణ ,టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, చింతాడ వాసుదేవ రావు ,కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాలపై పోలీసుల కఠిన నిబంధనలు

**మండపాల ఏర్పాటుకు ఒకే కిటికీ విధానంలో అనుమతులు**

**డీజేలు, అసభ్య కార్యక్రమాలకు అనుమతి లేదు.. నిమజ్జనంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం: జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్**




**కాకినాడ, సెప్టెంబర్ 3: (ప్రజా జ్యోతి)** గణేష్ ఉత్సవాలు, గణపతి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు కాకినాడ జిల్లా పోలీసులు పలు కఠిన నిబంధనలను ప్రకటించారు. గణపతి మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందుమాధవ్, ఐపీఎస్ సూచించారు.

**ఒకే కిటికీ విధానంలో అనుమతులు**

గణేష్ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని పోలీసులు స్పష్టం చేశారు. అవసరమైన అన్ని శాఖల అనుమతులను ఒకే కిటికీ విధానం ద్వారా పొందవచ్చన్నారు. ఇందుకోసం గణేష్ ఉత్సవాల అనుమతుల కోసం నిర్దేశించిన అంతర్జాల వేదిక ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకే కిటికీ విధానంలో అంతర్జాలం ద్వారానే దరఖాస్తులు చేయాలని, ప్రత్యక్షంగా దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు.ప్రైవేటు స్థలంలో మండపం ఏర్పాటు చేస్తే సంబంధిత స్థల యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రభుత్వ స్థలాల్లో మండపాల ఏర్పాటుకు సంబంధిత పంచాయతీ లేదా పురపాలక సంస్థ అనుమతి పొందాలి. అగ్నిమాపక, పంచాయతీ లేదా పురపాలక, విద్యుత్ శాఖలకు సంబంధించిన అనుమతులను కూడా ఒకే కిటికీ విధానం ద్వారా పొందాలని పోలీసులు సూచించారు.

**రహదారులకు అడ్డంకులు కలిగించొద్దు**

గణపతి మండపాలను రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయరాదని పోలీసులు స్పష్టం చేశారు. రహదారులపై రాకపోకలకు ఆటంకం కలిగించేలా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. మండపాల వద్ద జరిగే కార్యక్రమాల వల్ల ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు మండపం వద్ద కనీసం ఒక వాలంటీర్‌ను నియమించాలని, వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**మండపాల వద్ద భద్రతకు ప్రాధాన్యం**

రాత్రి వేళ మండపాల వద్ద కనీసం ముగ్గురు కమిటీ సభ్యులు లేదా స్వచ్ఛంద సేవకులు ఉండి భద్రతను పర్యవేక్షించాలని పోలీసులు సూచించారు. నాలుగు అడుగులకు మించిన విగ్రహాలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద తప్పనిసరిగా నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపం వేదిక కింద ఖాళీ ప్రదేశాన్ని చెక్కలతో లేదా ఇతర సురక్షిత ఏర్పాట్లతో మూసివేయాలని సూచించారు. రాత్రి వేళ మండపం వద్ద నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉంటే వాటి భద్రతకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

**అనుమానాస్పద వస్తువులపై అప్రమత్తంగా ఉండాలి**

మండపాల వద్ద అనుమానాస్పద వస్తువులు, సంచులు లేదా వాహనాలు ఎక్కువసేపు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచులతో మండపం వద్దకు వస్తే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మండపం కింద, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించాలని, ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. హాని తలపెట్టే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**డీజేలకు, అసభ్య కార్యక్రమాలకు నో!**

పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా డీజేలు, ధ్వని పరికరాలు, బాణాసంచా ఉపయోగించరాదని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతి పొందిన మేరకే వాటిని వినియోగించాలని తెలిపారు.రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తి పాటలకు మాత్రమే అనుమతి ఉంటుందని, సినిమా పాటలు, అసభ్యకరమైన పాటలు, అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలను నిర్వహించరాదని హెచ్చరించారు.

**నిమజ్జన ఊరేగింపులో నియమాలు తప్పనిసరి**

గణేష్ నిమజ్జన ఊరేగింపులో మద్యం సేవించి పాల్గొనరాదని పోలీసులు స్పష్టం చేశారు. పోలీసు శాఖ సూచించిన మార్గంలో, నిర్ణీత సమయంలోనే ఊరేగింపు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన నిమజ్జన ఘాట్ల వద్ద మాత్రమే విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. ఇతర మతాలు, కులాలు, రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా ఎలాంటి వ్యాఖ్యలు, నినాదాలు లేదా చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సమయంలో నీటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఊరేగింపు సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణపై జాగ్రత్తలు**

మండపాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు, విద్యుత్ కనెక్షన్లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యుత్ తీగలను ఎవరూ అనవసరంగా తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.మండపాల్లో రాత్రి సమయంలో నూనె దీపాలు వెలిగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ముందుగానే ఇసుక బస్తాలు, నీటి తొట్టెలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మండపాల వద్ద టపాకాయలు, ఇతర పేలుడు పదార్థాలను నిల్వ చేయరాదని స్పష్టం చేశారు.

**సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు**

సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. నిర్ధారణ కాని సమాచారాన్ని ఇతరులకు పంపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి గణపతి మండప నిర్వాహకుడు పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కాకినాడ జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఆదర్శ విద్యా నికేతన్‌లో కన్నులపండువగా కృష్ణాష్టమి వేడుకలు




ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు పెద్దవడుగూరు.స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఎంతో ఉత్సాహంగా, భక్తిభావంతో జరుపుకున్నారు. అధర్మాన్ని అణచి, ధర్మాన్ని నిలబెట్టేందుకు అవతరించిన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, తోరణాలతో సుందరంగా అలంకరించారు.ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలలోని చిన్నారి విద్యార్థులంతా శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలతో హాజరయ్యారు. నెమలి పింఛాలు, చేతిలో పిల్లనగ్రోవులతో చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి కృష్ణులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణ లీలల నాటికలు, గోపికల నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది ఉట్టి కొట్టే (దహీ హండీ) కార్యక్రమం. ఉపాధ్యాయులు పాఠశాల మైదానంలో ఎత్తుగా కట్టిన ఉట్టిని బద్దలు కొట్టేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. "గోవిందా.. గోపాలా.." అంటూ విద్యార్థులు చేసిన జయజయధ్వానాల మధ్య ఒక విద్యార్థి ఉట్టిని కొట్టడంతో మైదానమంతా చప్పట్లతో మారుమోగిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరణం నారాయణ రావు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన కర్తవ్య బోధనను, నీతిని విద్యార్థులు తమ జీవితంలో అన్వయించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.అనంతరం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు కృష్ణుడికి ఎంతో ప్రీతికరమైన అటుకులు, వెన్న, పాయసాన్ని ప్రసాదంగా విద్యార్థులకు పంపిణీ చేయడంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో ఎన్ఆర్ఐ శశి యాదవ్ సేవా కార్యక్రమాలు

**ఉట్టి కొట్టే విజేతలకు స్కై ఫౌండేషన్ ద్వారా బహుమతులు**

**యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం-ఎన్ఆర్ఐ శశి యాదవ్**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**కృష్ణాష్టమి సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కృష్ణుని ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ శశి యాదవ్ తెలిపారు.ముందుగా జిల్లా ప్రజలందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శశి యాదవ్ మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో విజేతలకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందించనున్నట్లు శశి యాదవ్ తెలిపారు.నియోజకవర్గంలోని చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటికే ప్రత్తిపాడులో నిర్వహించిన ఉద్యోగ మేళా ద్వారా పలువురు విద్యావంతులైన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.భవిష్యత్తులోనూ నియోజకవర్గంలోని చదువుకున్న యువతకు అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.తమ పూర్వీకులు ప్రత్తిపాడు,పిఠాపురం,కాకినాడ ప్రాంతాల్లో నివసించేవారని,ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని శశి యాదవ్ తెలిపారు.అందుకే స్కై ఫౌండేషన్ ద్వారా ప్రత్తిపాడు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు మీడియా ముఖంగా వెల్లడించారు.

## సేవలకు సత్కారం..ఎటపాక ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా**

**కలెక్టర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**




**ఎటపాక, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి):** విద్యా రంగంలో ఉత్తమ సేవలు అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా, విద్యాశాఖ ఉన్నతాధికారులు గురువారం ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. ఈ ఎంపికలో ఎటపాక మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందారు. చింతలచెరువు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు సోయం నవీన్, ఎర్రగుంట ఎంపీపీ పాఠశాల ఎస్. సుగుణ, గొల్లగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు లలిత గాయత్రి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. చింతలచెరువు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు సోయం నవీన్ గత 13 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ, మారుమూల ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహిస్తున్నారు. ఆయన బోధన, మార్గదర్శకత్వం ఫలితంగా 2026--27 విద్యా సంవత్సరంలో ఒక విద్యార్థిని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో సీటు సాధించగా, మరో ఇద్దరు విద్యార్థులు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలకు ఎంపికయ్యారు. మారుమూల గ్రామాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ఉపాధ్యాయుడిగా నవీన్ గుర్తింపు పొందారు. జిల్లా స్థాయిలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు.

# కోతులగుట్ట గురుకులంలో వరుస ఘటనలు

విద్యార్థుల భద్రత గాలికొదిలారా..?

జాహ్నవి మృతి ఘటన మరువకముందే ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థినులు అస్వస్థత

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్







**కూనవరం, సెప్టెంబర్ 3: ప్రజా జ్యోతి** కూనవరం మండలం కోతులగుట్ట గురుకుల ఆశ్రమ పాఠశాలలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు బాబు బొర్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 30న ఏడో తరగతి విద్యార్థిని తెల్లం జాహ్నవి మృతి ఘటన మరువకముందే, సెప్టెంబర్ 2న ఫుడ్ పాయిజన్ కారణంగా ఆరో తరగతి విద్యార్థినులు మడకం వైష్ణవి, సవలం దివ్య సహా మరో విద్యార్థిని అస్వస్థతకు గురికావడం పాఠశాల నిర్వహణపై తీవ్ర ప్రశ్నలు తలెత్తేలా చేసిందన్నారు. సాయంత్రం అస్వస్థతకు గురైన విద్యార్థినులను అనంతరం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. అయితే విద్యార్థినులు ఆసుపత్రిలో అబ్జర్వేషన్‌లో ఉన్న సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు వారి వద్ద ఉండకుండా తిరిగి వెళ్లిపోవడం బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట అని బాబు బొర్రయ్య విమర్శించారు. ఒక విద్యార్థిని మృతి చెందిన ఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే మరోసారి విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, భద్రతపై సమగ్ర విచారణ అవసరాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్, సంబంధిత ఉపాధ్యాయుల పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పీవో అధికారులను ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. విద్యార్థుల ప్రాణాలు, ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకునేది లేదని బాబు బొర్రయ్య హెచ్చరించారు.

# పెన్షన్లపై కూన రవికుమార్, ధర్మాన కృష్ణచైతన్య మధ్య వాగ్వాదం

- అర్హుల పెన్షన్లు తొలగించారంటూ పరస్పర విమర్శలు
- ఆధారాలతో సమాధానం చెబుతానన్న ఎమ్మెల్యే







**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** పెన్షన్ల అంశం ఆమదాలవలస నియోజకవర్గ రాజకీయాల్లో వాడివేడిగా మారింది. కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారుల పెన్షన్లు తొలగిస్తోందంటూ వైసీపీ జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్రంగా స్పందించారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అర్హుల పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగిస్తోందన్న ఆరోపణలను కూన రవికుమార్ ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం లోనే అనేక మంది అర్హులైన లబ్ధిదారుల పెన్షన్లు తొలగించారని ఆరోపించారు. గత ప్రభుత్వ కాలంలో టీడీపీ కార్యకర్తలనే కారణంతో సుమారు ఏడు లక్షల పెన్షన్లు తొలగించినట్లు తన వద్ద ఆధారాలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**వంద మంది వచ్చినా ఒక్కడినే సమాధానం చెబుతా" :**

వైసీపీ నాయకులు వంద మంది వచ్చినా తాను ఒక్కడినే సమాధానం చెప్పగలనని కూన రవికుమార్ అన్నారు. పెన్షన్ల విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీపై విమర్శలు చేయడం సరికాదని ధర్మాన కృష్ణచైతన్యకు కౌంటర్ ఇచ్చారు. గత వైసీపీ పాలనలో జరిగిన పెన్షన్ల తొలగింపుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

**ఏ నియోజకవర్గంలోనైనా పోటీ చేసే దమ్ము ఉంది :**

వాగ్వాదం సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ధర్మాన కృష్ణచైతన్య చేసిన సవాల్‌పై కూడా కూన రవికుమార్ స్పందించారు. నరసన్నపేట మాత్రమే కాకుండా జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనైనా పోటీ చేసే సత్తా, దమ్ము తనకు ఉందని



అన్నారు. కృష్ణచైతన్యకు అలాంటి కోరిక ఉంటే తీరుస్తానంటూ వ్యాఖ్యానించారు. తాను 90వ దశకంలోనే ఎంపీపీగా పనిచేసిన అనుభవం ఉందని కూన రవికుమార్ గుర్తుచేశారు. తనను ఎంపీటీసీగా గెలవాలని సూచించడం అవగాహన లేమికి, మూర్ఖత్వానికి నిదర్శనమంటూ ధర్మాన కృష్ణచైతన్యపై ఎమ్మెల్యే కౌంటర్ ఎటాక్ చేశారు.

# స్వయం ఉపాధికి మెప్మా పెద్దపీట

## స్వయం ఉపాధికి మెప్మా చేయూత.

## రూ.44 కోట్ల రుణ దరఖాస్తులు



**బాపట్ల సెప్టెంబరు 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మహిళలు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా బాపట్లలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా లోన్ మేళా విజయవంతమైంది. బాపట్ల పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ మేళాలో 288 మంది వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు దాదాపు రూ.44 కోట్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో వివిధ బ్యాంకుల మేనేజర్లు ముఖాముఖి నిర్వహించి, వ్యాపార ప్రణాళికలు, రుణ అర్హతలు, బ్యాంకింగ్ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా బ్యాంకర్లు రూ.1.27 కోట్లకు సంబంధించి 20 మంజూరు పత్రాలను అందజేశారు. వీటిలో 8 పీఎంఎఫ్ఎంఈ, 12 పీఎంఈజీపీ యూనిట్లు ఉన్నాయి. తృప్తి క్యాంటీన్, చాయ్ రాస్తా, యూఎంఈ ఎంబ్రాయిడరీ వంటి యూనిట్లకు కూడా రుణాలు మంజూరయ్యాయి. ఈ సందర్భం గా మెప్మా పీడీ డాక్టర్ ఆనంద్ సత్యపాల్ మాట్లాడుతూ.. రుణాలను కేవలం ఆర్థిక సహాయంగా కాకుండా కుటుంబాలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించే అవకాశంగా చూడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకింగ్ వ్యవస్థతో మంచి సంబంధాలు కొనసాగించాలని కోరారు. అర్హత పొందిన యూనిట్లను వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యాపార అవకాశాలపై కూడా మేళాలో అవగాహన కల్పించారు. అరకు కాఫీ, తృప్తి క్యాంటీన్, చాయ్ రాస్తా, యూఎంఈ ఎంబ్రాయిడరీ, మిస్ బర్గర్, మోమో నెస్ట్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని, ఫ్రాంచైజీ విధానం, పెట్టుబడి, శిక్షణ, మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు ప్రత్యేకంగా నిర్వహించిన మహిళా స్వయం ఉపాధి, సాధికారత అవగాహన కార్యక్రమంలో యూఎంఈ ఎంబ్రాయిడరీ ప్రతినిధి పైడి శ్రేయశ్రీ గుప్తా, మహిళలకు ఆధునిక ఎంబ్రాయిడరీ సాంకేతికత, శిక్షణతో పాటు ఇంటి నుంచే ఉపాధి పొందే అవకాశాలను వివరించారు. మహిళలు ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా వీధి విక్రయదారుల కోసం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించి 52 మంది స్వానిధి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. రుణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, బ్యాంకర్లతో సమన్వయం ద్వారా అర్హత కలిగిన యూనిట్లకు త్వరితగతిన రుణ మంజూరు, యూనిట్ ప్రారంభ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎల్‌డీఎం మేనేజర్ శివకృష్ణ, మెప్మా సిబ్బంది, సిఎంఎంలు, సీఓలు, ఆర్‌పీలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఓబులేష్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఓబులేష్ కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి (ప్రమోషన్) పొందారు. విధి నిర్వహణలో ఆయన కనబరిచిన ప్రతిభ, నిబద్ధతను గుర్తిస్తూ ఉన్నతాధికారులు ఆయనకు ఈ పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓబులేష్‌కు తోటి పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు. పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్ ఓబులేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా తన విధులను మరింత బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఓబులేష్ పదోన్నతి పొందడం పట్ల పట్టణ ప్రజలు, సహచర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లి మృతి.. ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుపై కుటుంబానికి ఆందోళన





**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** బద్వేల్ మండలం తిరువెంగళపురం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాగిపోగు అమరావతి (33) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ గురువారం రిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. దీంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అమరావతికి 13 ఏళ్ల కుమార్తె, 11 ఏళ్ల కుమారుడు ఉన్నారు. వీరిద్దరూ ప్రస్తుతం చదువుకుంటున్నారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు తల్లిప్రేమకు దూరమయ్యారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి ఈశ్వరయ్యపై ఇప్పుడు ఇద్దరు పిల్లల బాధ్యత పూర్తిగా పడింది. ఈశ్వరయ్యకు సుమారు 15 సంవత్సరాల క్రితం లారీ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయన ఒక కాలు విరిగిపోవడంతో కృత్రిమ కాలుతో జీవనం సాగిస్తున్నారు. శారీరక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుటుంబాన్ని పోషించేందుకు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆటో నడిపితేనే రోజువారీ కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల ఖర్చులు తీర్చుకునే పరిస్థితి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో భార్య అమరావతి మృతి చెందడంతో ఈశ్వరయ్యకు కుటుంబాన్ని ఎలా నడిపించాలో, పిల్లల చదువులను ఎలా కొనసాగించాలో ఆందోళన నెలకొంది. తల్లి లేని లోటుతో పాటు ఆర్థిక ఇబ్బందులు చిన్నారుల భవిష్యత్తుపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణరెడ్డి లేదా రితీష్‌రెడ్డి స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఈశ్వరయ్య వేడుకుంటున్నారు. తన పిల్లల చదువులు ఆగిపోకుండా, వారి భవిష్యత్తుకు అండగా నిలిచి అవసరమైన సహాయం అందించాలని ఆయన ప్రాధేయపడుతున్నారు. ఇప్పటికే ఒక కాలుతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆటో నడుపుతున్న తనకు భార్యను కోల్పోవడం మరింత భారంగా మారిందని ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు స్పందించి ఈ ఇద్దరు చిన్నారుల చదువుకు సహాయం అందించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆ వ్యాలీలో 9% ప్రాంతం డేంజర్ జోన్‌లో 58శాతం జనాభా రిస్క్‌లో

**కొండచరియల ప్రమాద అవకాశాలపై కీలక రీసెర్చ్!**

ఆకస్మిక వరదలు కారణంగా నేపాల్‌లో జరిగిన ఘోర విషాదం తర్వాత హిమాలయ రాష్ట్రాల భద్రత గురించి ఒకింత ఆందోళన నెలకొంది. హిమాలయ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం అత్యంత ప్రమాదకరమైన భౌగోళిక విపత్తులలో ఒకటిగా మారిపోయింది. గత కొన్ని దశాబ్దాలుగా ఆ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడడం వల్ల అపారమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లోని చైనా సరిహద్దు జిల్లా అయిన పిథోర్‌గఢ్‌లో ఉన్న దర్మా లోయలో కొండచరియల విరిగేపడే ముప్పు, ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు, సంబంధిత నష్టాలపై డెహ్రాడూన్‌లోని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీకి చెందిన శాస్త్రవేత్తలు ఒక అధ్యయనం చేశారు. ఈ అధ్యయనం ప్రకారం దర్మా లోయలోని దాదాపు 9శాతం ప్రాంతం అత్యంత ప్రమాదకరమైన, సున్నితమైన జోన్‌లో ఉంది. ఆ ప్రాంతంలోని మొత్తం జనాభాలో దాదాపు 58శాతం మంది ప్రజలు రిస్క్ జోన్‌లో నివసిస్తున్నారు. ఈ అధ్యయనం పర్వత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో విపత్తు ప్రమాద హెచ్చరికను సూచిస్తోంది.

దర్మా లోయలో 22 శాతం ప్రాంతం మధ్యస్థ డేంజర్ జోన్‌లో, 26 శాతం లో-రిస్క్ జోన్‌లో ఉన్నట్లు ఈ అధ్యయనం తేల్చింది. అలాగే మరో 43 శాతం వెరీ లో-రిస్క్ జోన్‌లో ఉన్నట్లు రీసెర్చ్‌లో వెల్లడైంది. కాగా, సరిహద్దు జిల్లా అయిన పిథోర్‌గఢ్‌లోని దర్మా లోయలో కొండచరియల విరిగిపడే ప్రమాదం కేవలం సహజ వాలులకే పరిమితం కాదు. రోడ్లు, నివాస ప్రాంతాలు, ఆనకట్టలు, వేలాది మంది ప్రజలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అందుకే వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీకి చెందిన శాస్త్రవేత్తలు దర్మా లోయలో కొండచరియలు విరిగిపడే అవకాశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. మెషిన్ లెర్నింగ్, రిమోట్ సెన్సింగ్, వర్షపాతం, భూకంప తీవ్రతపై డేటాను ఉపయోగించి ఈ ముప్పును అంచనా వేశారు. వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ రీసెర్చ్ ప్రకారం, దర్మా లోయలో తవాఘాట్, జంకు, ఖేత్, సోబ్లా, దార్, బాలింగ్, చంకమ్, ఉర్తింగ్, మండప్, నాగ్లింగ్, ఫిలామ్, దుగ్తు, బాన్, గోయి, మార్చా, టిడాంగ్, సిపు సహా పలు గ్రామాలున్నాయి. ఇవి సముద్ర మట్టానికి సుమారు 1,150 మీటర్ల నుంచి 3,410 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 2,000- 2,500 మిల్లీమీటర్లు. మొత్తం వర్షపాతంలో సుమారు 82 శాతం రుతుపవనాల కాలంలో (జూన్- సెప్టెంబర్ వరకు) కురుస్తుంది. ఉపగ్రహ చిత్రాలు, గూగుల్ ఎర్త్ చిత్రాలు, క్షేత్రస్థాయి సర్వేల ఆధారంగా 2001-2023 మధ్య ఈ దర్మా లోయలో 295 కొండచరియల విరిగిపడే సంఘటనలు సంభవించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సైంటిస్టులు చేసిన ఈ అధ్యయనం కేవలం కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించడానికే పరిమితం కాలేదు. వర్షపాతం, భూకంపాలపై డేటాను కూడా సేకరించారు. అందుకోసం గత 40 సంవత్సరాల వర్షపాత రికార్డులను పరిశీలించారు. దర్మా లోయలో కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు బలహీనమైన భూగర్భ నిర్మాణం, నిటారు వాలులు, భారీ వర్షపాతం, భూకంపం వల్ల కూడా సంభవించవచ్చని సైంటిస్టులు గుర్తించారు.

# చౌప్పెల్ల గ్రామ స్మశాన వాటికను సర్వే చేసిన రెవెన్యూ అధికారులు






**ఆలమూరు సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి):**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండల పరిధిలోని చొప్పెల్ల గ్రామం లంకలో ఉన్న స్మశాన వాటికను శుభ్రం చేయించాలని, కాంపౌండ్ వాల్స్, త్రాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాలు కల్పించడం అత్యవసరం అని, అలాగే స్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురయినదని, సర్వే చేయించిన అనంతరం స్మశాన వాటిక స్థలానికి రక్షణ గోడ కట్టించాలని దాని వలన ఆక్రమణలను అరికట్టడానికి మరియు పశువులు ప్రవేశించ కుండా ఉండటానికి అవకాశం ఉండదని,నీటి సౌకర్యం కల్పించాలని అంత్యక్రియల షెడ్,దహన వాటిక వర్షం పడినప్పుడు ఇబ్బంది లేకుండా నిలబడటానికి శాశ్వత షెడ్ నిర్మాణం కట్టించాలని, దహన సంస్కారాలు అనంతరం స్నానాలకు ఇబ్బంది లేకుండా పెద్ద కాలువ రేవు వద్ద మోటార్ వేయించాలని కోరుచు ఈ 2026 జూలై నెల 27 న కొత్తపేట ఆర్డీఓ వారికి ఆలమూరు మండల బిజెపి అధ్యక్షుడు సుంకర శ్రీరాములు ఆధ్వర్యంలో బిజెపి జిల్లా నాయకులు నాగిరెడ్డి స్వామి, పాలూరి సత్యనందం, కోటిపల్లి దామోదర్ లు వినతిపత్రం ఇవ్వడమైనది.ఆర్డివో వారికి ఇచ్చిన వినతిపత్రం ననుసరించి ఆలమూరు మండల బిజెపి అధ్యక్షుడు సుంకర శ్రీరాములు సమక్షంలో మండల సర్వేర్ మాగాపు సుదర్శన్, చొప్పెల్ల గ్రామ వీఆర్వో టి.ప్రకాష్ స్మశాన వాటిక స్థలం పక్కన ఉన్న సరిహద్దులుదారుల సమక్షంలో గురువారం సర్వే చేయడం జరిగింది. రెవిన్యూ రికార్డుల ప్రకారం స్మశాన వాటిక స్థలం య 1.50 సెంట్లు(అనగా పదిహేను కుంచాలు)కొలతల ప్రకారం ఇంచుమించు సరిపోతుందని అన్నారు.

# ఎన్‌హెచ్--30పై రాంగోపాలపురం వద్ద టోల్‌ప్లాజా ప్రారంభం

**విజయవాడ--జగదల్‌పూర్ రహదారిపై టోల్ వసూళ్లకు రంగం సిద్ధం ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మధ్య కీలక రవాణా మార్గం**

**టోల్‌తో పాటు రహదారి నిర్వహణ, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి స్థానికులు రంబాలా నాగేశ్వరరావు**




## రాంగోపాలపురంలో టోల్ ప్లాజా ప్రారంభం

విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-30పై ఎటపాక మండలంలో కార్యకలాపాలు ప్రారంభం



టోల్‌తో పాటు రహదారి నిర్వహణ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలంటున్న స్థానికుడు రంబాలా నాగేశ్వరరావు

**ఎటపాక, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి):**విజయవాడ--జగదల్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్--30)పై రాంగోపాలపురం వద్ద నూతనంగా నిర్మించిన టోల్‌ప్లాజా గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అనుగుణంగా టోల్ వసూళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లతో పాటు పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రాన్ని అనుసంధానించే ఈ ప్రధాన జాతీయ రహదారిపై నిత్యం వేలాదిగా భారీ సరుకు రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎటపాక మండలం మీదుగా సాగే ఈ అంతర్రాష్ట్ర మార్గంలో రాంగోపాలపురం వద్ద టోల్‌ప్లాజా కార్యకలాపాలు మొదలుకావడం స్థానికంగా, దూరప్రాంత ప్రయాణికుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టోల్ రుసుముల వివరాలు, ఫాస్టాగ్ తదితర నిబంధనలకు సంబంధించిన సూచిక బోర్డులను ప్లాజా వద్ద ఏర్పాటు చేయనున్నారు. రాంగోపాలపురం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు కావడం ఈ ప్రాంత రవాణా వ్యవస్థలో ఒక కీలక పరిణామమని స్థానికుడు రంబాలా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వైపు సాగే ఈ జాతీయ రహదారి విస్తరణతో పాటు టోల్‌ప్లాజా అందుబాటులోకి రావడం వల్ల మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, కేవలం టోల్ రుసుములు వసూలు చేయడమే కాకుండా రహదారి నిర్వహణ, ప్రయాణికుల భద్రత, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి కనీస సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని ఆయన కోరుతున్నారు. ఈ టోల్‌ప్లాజా రాకతో భవిష్యత్తులో ఈ ప్రాంత వాణిజ్య, రవాణా రంగాలపై ఎలాంటి ప్రభావం పడుతుందో వేచి చూడాలి.

## రాజ్యాంగ పరిరక్షణ సభను జయప్రదం చేయండ్డి జే ఏసీ రాష్ట్ర కార్యదర్శివర్గ దస్తగిరి



**నంద్యాల:సెప్టెంబర్=03 ప్రజాజ్యోతి** సెప్టెంబరు ఆరవ తారీఖున మార్కాపురం జరగబోయే రాజ్యాంగ పరిరక్షణ సభను జయప్రదం చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి పిలుపునిచ్చారు అందులో భాగంగా బుధవారం నాడు నంద్యాల పట్టణంలో పరిరక్షణ సభ కరపత్రాలు విడుదల చేశారు ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ నంద్యాల జిల్లా నలుమూల నుండి అధిక సంఖ్యలో అంబేద్కర్ వాదులు మాల మహానాడు నాయకులు మహిళా సంఘాలు మాల ఉద్యోగ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాల మహానాడు రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు ప్రముఖ న్యాయవాది జై భీమ్రావు పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ కుమార్ రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు ప్రఖ్యాత గాయకులు వెంచర్ల రాజేషు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిషోర్ మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ బాబు హాజరు హాజరవుతున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షులు బండి దేవాంతకుడు మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసి పుల్లయ్య తదితర మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు

# నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంజునాథ్ మాదిగ కు ఘన సన్మానం



**గుంతకల్లు సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** గురువారం పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవల ఎమ్మార్పీఎస్ గుంతకల్లు మండల అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన డి.మంజునాథ మాదిగ మరియు గుంతకల్లు టౌన్ కన్వీనర్ డేవిడ్ మాదిగ, గుంతకల్లు మండల ప్రచార కార్యదర్శి బి మోహన్ కు గుంతకల్లు మండలంలోని పుల్లగుట్ట పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు నూతన కమిటీ నాయలకు శాలువాలు పూలమాలను వేసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజే యడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు మంజునాథ్ మాదిగ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మండల అధ్యక్షులుగా బాధ్యతలు ఇచ్చినందుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మరియు జిల్లా ఇన్చార్జి ముమ్మిడివరం ను చిన్న సుబ్బారావు మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు సి నర్సింలు మాదిగ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అలాగే వారి ఆదేశాల మేరకు గుంతకల్లు మండలంలో అన్ని గ్రామాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చే ప్రతి కార్యక్రమాల ను నిర్వహిస్తానని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మండలం ఎంఎస్పి మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు, మాజీ మండలాధ్యక్షులు రాజు మాదిగ, పవన్, గణేష్, సాయి మరియు ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో మలేరియా టైఫాయిడ్ డెంగు



**ప్రజాజ్యోతి న్యూస్ ప్యాపిలి సెప్టెంబర్ 3** ప్యాపిలి పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం గారి అధ్యర్యంలో డాక్టర్. రాజారావ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాఘవేంద్ర గౌడు విద్యార్థిని విద్యార్థులకు సీజనల్ వ్యాదులు టైఫాయిడ్, హెపటైటిస్, మలేరియా, డెంగీ, చికెన్ గుణ్య అమీబియ్యసిస్ డయేరియా,పుట్టుక తో లోపాలు, పోషకాహార లోపాలు వివిధ వ్యాదుల పైన, శరీరక, మానసిక అభి రుద్దిలో లోపాలు మొదలగు, వ్యాదుల పైన అవగాహనా కల్పించి,142 మంది విద్యార్థిని విద్యార్థుల కు స్క్రీనింగ్ నిర్వహించి హోమియో పతి మాత్రలు పంపిణి చేయడం జరిగింది. కార్యక్రమం లో ఎం ఎల్ ఎచ్ పి శ్రీజ,ఎన్ సి సి ప్రోగ్రాం అధికారి నవీన్, అధ్యాపకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

## వివాహ కార్యక్రమానికి హాజరైన మాజీ విశ్వేశ్వర రెడ్డి



**ఆగష్టు 3 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జీ శ్రీనివాస్ నాయుడు:-** కర్నూల్ నందు సెయింట్ జోసెఫ్ కాలేజ్ లో కర్నూల్ జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి గారి కుమారుడు మరియు ఆర్ యు డి ఎ మాజీ చైర్మన్ కూతురి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పి ఏ సి మెంబెర్ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జి వై. విశ్వేశ్వర రెడ్డి గారు మరియు మహాలక్ష్మి శ్రీనివాసులు,రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ని మర్యాదపూర్వకంగా కలిసిన కురుబ జిల్లా అధ్యక్షులు దొనస్వామి



**గుంతకల్లు సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** అనంతపురం జిల్లా నూతన కురుబ సంఘ అధ్యక్షులుగా ఎంపికైన కె.దొనస్వామి గురువారం గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ని ఆయన క్యాంపు కార్యాలయం నందు దొనస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించి హృదయపూర్వక ధన్యవా దములు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా కురుబ సంఘం ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బేతపూడిలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాల పరిశీలన




**బాపట్ల సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను తెలుసుకునే క్రమంలో ఎంపీడీవో బి. బాబురావు బేతపూడి గ్రామానికి చేరుకుని గ్రామసభలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, మార్కింగ్‌కు సంబంధించిన జాబితాలపై గ్రామస్థులతో చర్చించి వివరాలను పరిశీలించారు.గతంలో ప్రకటించిన ఓటర్ల జాబితాల్లో ఏమైనా అభ్యంతరాలు, మార్పులు చేయాల్సిన అంశాలు ఉంటే తెలియజేయాలని అధికారులు సూచించారు. అయితే గ్రామస్థుల నుంచి ఎలాంటి ఆక్షేపణలు వ్యక్తం కాకపోవడంతో ఇప్పటికే ప్రకటించిన జాబితాలనే తుది జాబితాలుగా ఖరారు చేస్తూ గ్రామసభ తీర్మానించింది.గ్రామంలోని మొత్తం 3,176 మంది ఓటర్లలో ఎస్సీ ఓటర్లు 263 మంది, ఎస్టీ ఓటర్లు 183 మంది, బీసీ ఓటర్లు 163 మంది, ఇతర ఓటర్లు 2,567 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జి. రామకృష్ణ, పంచాయతీ అభివృద్ధి అధికారి మాణిక్యమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గర్భకుంటకు నూతన విద్యుత్ లైన్ మంజూరు

**ఎమ్మెల్యే శిరీషదేవిభాస్కర్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు**



**ఎటపాక, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ పరిధిలోని అచ్యుతాపురం (గర్భకుంట) గ్రామానికి నూతన విద్యుత్ లైన్ మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన విద్యుత్ లైన్ మంజూరుకు కృషి చేసిన రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు మిరియాల శిరీషదేవిభాస్కర్‌కు గ్రామస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో రోజులుగా విద్యుత్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల సమస్యకు పరిష్కారం లభించడంతో తమ గ్రామ అభివృద్ధికి ఇది కీలక ముందడుగు అని వారు పేర్కొన్నారు. నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు ద్వారా గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు ప్రయోజనం చేకూరుతుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దానే రాజు, కొమరం రాంబాబు, తెల్లం వెంకటేష్, పాయం హరి, మడకం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణదారులపై, జేసీబీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: ప్రజాబలం సంఘం డిమాండ్




**సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** కూడేరు మండల పరిధిలోని సర్వే నంబర్ 19 మరియు దానికి ఆనుకుని ఉన్న సుమారు 5 ఎకరాల ప్రభుత్వ కొండ గుట్టల ఆక్రమణపై అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాబలం సంఘం పామిడి మండల అధ్యక్షుడు సభావాత్ గోవిందు నాయక్ డిమాండ్ చేశారు. ఉదరిపు కొండ తండ మరుట్ల గ్రామానికి చెందిన కొండగుట్ట భూమిని రాత్రికి రాత్రే యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకున్న తిరుపాల్ నాయక్‌పై, అలాగే ఆక్రమణకు సహకరించిన జేసీబీ, హిటాచీ యాజమాన్యాలపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న భూమిని ఆ ప్రాంతంలో ఉన్న భూమి లేని నిరుపేద రైతులకు, పేద కుటుంబాలకు సాగు నిమిత్తం పంపిణీ చేయాలి.అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించకపోతే, ప్రజాబలం సంఘం ఆధ్వర్యంలో బాధితులు, నిరుపేదలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సభావాత్ గోవిందు నాయక్ హెచ్చరించారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి!..

**నిరసన కార్యక్రమంలో!..**

**విద్యార్థినీ, విద్యార్థులు, ఆదివాసీ గిరిజన సంఘాలు!..**

**ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు!..**




**వి.ఆర్.పురం, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఆదివాసీ బిడ్డ ఊకె శిరీషా హైదరాబాదు లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న సందర్భం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకల పల్లి మండలానికి చెందిన, చౌటుగూడెం, గ్రామస్తు రాలు ఊకె శిరీషా, అనుఆదివాసి బిడ్డను, అత్యాచారానికి గురై హత్య చేయబడిన, పై శాసిక ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు, మనో ధైర్యాన్ని కల్పించాలని, ప్రభుత్వం వెంటనే నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబా నికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, తెలంగాణ ప్రభుత్వం 50లక్షల రూపాయల,ఎక్స్ గ్రేస్,యా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రేఖ పల్లిలో వివిధ ఆదివాసీ సంఘాలు మరియు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థిని, విద్యార్థులు మండల ప్రజానీకం ప్రదర్శన చేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసనతెలియజేశారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మెట్టు విశ్వనాథ్ రెడ్డి గారు



**సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-**నేడు హీరేహాల్ మండలం హిర్దేహాళ్ గెట్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ వన్నూరస్వామి గారి ఆహ్వానం మేరకు ఈరోజు వారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై అక్కడ ఏర్పాటు చేసిన పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించిన లిరాయదుర్గం నియోజకవర్గం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్రీ మెట్టు విశ్వనాథ్ రెడ్డి గారు ఈ కార్యక్రమం లో స్థానికులు మండల కన్వీనర్ మండల నాయకులు అనుబంధ విభగాల అధ్యక్షులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## యస్ వి మోహన్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్సన్ హాజరైన మాజి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి




**బనగానపల్లె :సెప్టెంబర్=03 ప్రజాజ్వోతి** కర్నూలు పట్టణంలోని యస్ టి బీ సి గ్రౌండ్ వద్ద కర్నూలు మాజీ ఎమ్మెల్యే యస్ వి . మోహన్ రెడ్డి గారి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మీయ స్వాగతం పలికిన కాటసాని అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

# సిపిఎం ఆధ్వర్యంలో పత్రిక సమావేశం



**సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-**కుల వివక్షత లేని సమాజం కోసం సామాజిక శంఖారావం కూడేరు మండల కేంద్రంలోని సిపిఎం ఆఫీస్ నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనం కులవ్యక్షత అన్ని గ్రామాల్లో ఉన్నదని దేవాలయాలకు ప్రవేశాలు ఎక్కడా లేవని దళితులకు చనిపోతే ఆరడుగుల స్మశానాలు కూడా లేవన్నారు దళిత కాలనీలలో మౌలిక సౌకర్యాలు మంచినీటి సౌకర్యాలు డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి దళిత కాలనీలను పర్యవేక్షించి తక్షణమే అన్ని గ్రామాలు దళిత కాలనీలకు మంచినీటి సౌకర్యాలు కల్పించి డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అలాగే డబ్బు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కాటికాపర్లకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ఇంటి స్థలం లేని పేదలను గుర్తించి ప్రతి కుటుంబానికి మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి ఐదు లక్షలతో ఇల్లు నిర్మించాలని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రధానంగా కడదరకుంట గ్రామంలో స్మశానం లేదని ఉన్న స్మశానం కూడా ఆక్రమణకు గురైంది అన్నారు అంతరంగ గ్రామంలో దేవాలయాల ప్రవేశం లేదన్నారు కమ్మూరు గ్రామంలో నేటికీ దళితులకు కటింగ్ చేయడం లేదన్నారు కరుట్లపల్లి గ్రామంలో మంచినీటి సౌకర్యం దళిత కాలనీకి లేదన్నారు స్మశానంలో గుంతలు తీసే కాటికాపర్లకు గుర్తించి ప్రభుత్వం ఐదు వేల రూపాయలు పింఛన్ సౌకర్యం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ కరీం సాబ్ బ్రహ్మయ్య రైతు సంఘం మండల కార్యదర్శి వీరప్ప సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించండి



**సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు:-** ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత మలేరియా సబ్ యూనిట్ అధికారుల పైన ఎంతైనా కలదని గురువారం నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ కుమార్ పేర్కొన్నారు గ్రామాలలో వైద్యా ఆరోగ్యశాఖ సిబ్బంది క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాల న్నారు అలాగే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన ప్రజలకు రోగుల చికిత్స అనంతరం జ్వరం కేసులన్నింటికీ మలేరియా మరియు డెంగ్యూ అని తమ అనుమతి లేకుండా నోటిఫైడ్ వ్యాధులను ప్రైవేటు ఆసుపత్రిల యాజమాన్యం వారు డిక్లరేషన్ చేయరాద న్నారు అట్లు చేసిన ప్రైవేట్ యాజమాన్యాల పైన కఠిన చర్య తీసుకుంటామన్నారు ఏదైనా గ్రామాలలో జ్వరం కేసుకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది తమ దృష్టికి తేవాలన్నారు గ్రామాలలో వారి వారికి నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను నూటికి నూరు శాతం క్రమ శిక్షణతో పూర్తి చేయాలన్నారు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్నిచోట్ల దోమల లార్వాలను నిర్మూలించుటకై గంబుషా చాప పిల్లల్ని వర్షపు నీటి నిల్వ ప్రాంతాలలో వదలాలన్నారు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల ప్రకారం దోమకాటు వలన సంభవించే వ్యాధులను గ్రామాలలో నియంత్రించడానికి అంకు టి తదీక్షతో పనిచేయా లన్నారు ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి టి వెంకటేశ్వర్లు మలేరియా సబ్ యూనిట్ అధికారులు గిరిధర్ రెడ్డి బత్తుల కోదండరామిరెడ్డి మద్దయ్య ఎస్ ప్రభాకర్ చిగురుపాటి శ్రీనివాసులు రామకృష్ణ రామాంజ నేయులు దేవలాల్ నాయక్ జయరాం నాయక్ తిరుపాలయ్య నాగేంద్రప్ర సాద్ శ్రీనివాసులు సెమివుల్లా శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యం రైతులకు అదనపు ఆదాయం



**బాపట్ల సెప్టెంబరు 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు రైతులు ఆర్థికంగా లాభపడవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగాధిపతి డా. లాల్ అహమ్మద్ మొహమ్మద్ తెలిపారు. ఐసీఏఆర్-ఐఐఎంఆర్, హైదరాబాద్ ప్రాయోజిత ఎస్‌సీఎస్‌పీ పథకం కింద రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలకు చిరుధాన్యాల సాగు, విలువ జోడింపు అంశాలపై కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. లాల్ అహమ్మద్ మాట్లాడుతూ రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు, సామలు, ఊదలు వంటి చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, ఆరోగ్య పరిరక్షణకు ఇవి ఎంతో ఉపయోగకరమన్నారు. డా. జి.వినయ్ కుమార్ మాట్లాడుతూ తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాలను సాగు చేయవచ్చని, ప్రతికూల వాతావరణాన్ని సైతం ఇవి తట్టుకుంటాయని తెలిపారు. డా. ఎన్.కిరణ్ కుమార్ చిరుధాన్యాల్లో పంటల సంరక్షణ, విత్తన శుద్ధి పద్ధతులను వివరించారు. డా. ఎన్.రత్నకుమారి చిరుధాన్యాల్లోని క్యాల్షియం, ఇనుము వంటి పోషకాలు పిల్లలు, మహిళలకు ఉపయోగకరమని తెలిపారు. చిరుధాన్యాలతో వివిధ విలువ జోడింపు ఆహార ఉత్పత్తులు తయారు చేసి మహిళలు స్వయం ఉపాధి, ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమం అసోసియేట్ డీన్ డా. పి.ప్రసూన రాణి ఆదేశాల మేరకు నిర్వహించగా పలువురు రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## పచ్చదనంతో సూర్యలంకకు సరికొత్త శోభ



**బాపట్ల సెప్టెంబరు 3 ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పర్యావరణ పరిరక్షణతో పాటు సూర్యలంకను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో తీరప్రాంతంలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సూర్యలంక అటవీశాఖ నగరవనం సమీపంలో గురువారం విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఏపీ గ్రీన్ కార్పొరేష న్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కలిసి మొక్కలు నాటారు. అనంతరం బోటులో తీరప్రాంతాలను పరిశీలించారు. సూర్యలంక బీచ్ దిబ్బ సమీపంలో తీర కోతను నివారించేందుకు, పచ్చదనాన్ని పెంచేందుకు తాటి విత్తనాలు నాటారు. తీరం వెంబడి అభివృద్ధి అవకాశాలను పరిశీలిస్తూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తుపానులు, బలమైన గాలులు, సముద్రపు కోత నుంచి తీరాన్ని రక్షించడంలో తాటి చెట్లు, అడవులు రక్షణ కవచంలా పనిచేస్తాయని తెలిపారు. బాపట్ల నియోజకవర్గాన్ని పర్యావరణహిత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఏ.హరికుమార్, తహశీల్దార్ సలీమా, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ, విన్నకోట సురేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల నారాయణ, అటవీశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బోర్లు రిపేరు చేసి సింటెక్ ట్యాంక్ లు ఏర్పాటుచేసి పట్టణ ప్రజల నీటి సమస్యలు తీర్చండి



**గుంతకల్లు సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో పట్టణంలో వారానికి ఒకసారి మంచినీళ్లు వదలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కావున పట్టణంలో వివిధ వార్డులో చెడిపోయిన బోర్లను రిపేరు చేసి, బోర్లు లేని వార్డులలో బోర్లు వేసి అలాగే సింటెక్ ట్యాంకులు ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రజలకు నీటి కొరత తీర్చాలని గురువారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం లో ఆర్డీవో శ్రీనివాస్ కి బిజెపి నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీవో శ్రీనివాస్ స్పందించి దానికి తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర నాయకురా లు మరియు ఎఫ్సీఐ స్టేట్ డైరెక్టర్, వనగొంది విజయ లక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా ఎలక్షన్ ఇంచార్జ్ గుర్రం సూర్యనారా యణ, జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ జిఎం మహేష్, బిజెపి నాయకులు నారాయణరెడ్డి, మహిళా మోర్చా నాయకులు లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## చొప్పెల్ల గ్రామంలోని గోపాలస్వామి వారి ఆలయంలో నేడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు.



**ఆలమూరు సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో వెలసి ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాలస్వామి వారి ఆలయంలో నేడు శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయని, అందులో భాగంగా ఈరోజు ఉదయం నుండి స్వామివారికి విశేష పూజా కార్యక్రమములు జరుగుతాయని,రాత్రి 7 గంటల నుండి ఉట్టుకొట్టే కార్యక్రమం జరుగునని కావున భక్తులు, భక్త మహా తల్లులు,చిన్నలు, పెద్దలు అందరూ విచ్చేసి కార్యక్రమాలు తిలకించి స్వామివారిని దర్శించుకుని, స్వామి వారి ప్రసాదము స్వీకరించి ఆ కృష్ణ పరమాత్ముని అనుగ్రహ ఆశీర్వాదాలు పొందవలసిందిగా ఆలయ ఈవో మద్దూరి శివరామకృష్ణ,ఆలయ పాలకవర్గం వారు, అర్చకస్వాములు కోరుచున్నారు.

# బెంచ్‌ప్రెస్ విజేతలకు ఘన సన్మానం క్రీడల్లో యువత రాణించాలి

## ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు రోటరీ ముందుంటుంది

## రోటరీ రివర్‌సైడ్ అధ్యక్షుడు డా. మల్లంపాటి నరసింహారెడ్డి



**బెంచ్‌ప్రెస్ విజేతలకు ఘన సన్మానం**
పాల్వంచ జిల్లాస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులను సత్కరిస్తున్న రోటరీ రివర్‌సైడ్ ప్రతినిధులు

**ఎటపాక, సెప్టెంబరు 3 (ప్రజాజ్యోతి):** పాల్వంచలో ఆగస్టు 30న నిర్వహించిన జిల్లాస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులకు రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. భద్రాచలం యూబీ రోడ్డులోని పద్మావతి తల్లి పిల్లల ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. జిల్లాస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన డీవీ శంకర్రావు, మహంతి వెంకటకృష్ణాజీ, వాకచర్ల లక్ష్మీనారాయణ, యారం నాగ పున్నారెడ్డి, శ్రీరామ్ నటరాజన్, చాణక్య, మామిడి భూమికలను రోటరీ రివర్‌సైడ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. క్రీడాకారులకు నిరంతరం శిక్షణ అందించి విజయానికి బాటలు వేసిన కోచ్ జీవీ రామిరెడ్డిని కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం అధ్యక్షుడు రోటేరియన్ డా. మల్లంపాటి నరసింహారెడ్డి (ఎంబీబీఎస్, ఎండీ--రేడియాలజీ) మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించేందుకు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని అన్నారు. బెంచ్‌ప్రెస్ వంటి క్రీడల్లో జిల్లా స్థాయిలో పతకాలు సాధించడం భద్రాచలం ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. విజయం సాధించిన ప్రతి క్రీడాకారుడి వెనుక ఎన్నో రోజుల కఠోర శ్రమ, క్రమశిక్షణ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వం ఉంటాయని అన్నారు. క్రీడాకారులు సాధించిన విజయాలు ఇతర యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. యువత చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని డా. నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో సాధించిన విజయాలను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు క్రీడాకారులు మరింత కఠోర సాధన చేయాలని సూచించారు. ముఖ్యంగా బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఇదే పట్టుదలను కొనసాగిస్తూ ఉన్నత స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం కార్యదర్శి డా. ప్రశాంత్ పోతరాజు, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. సాయి కిషోర్ కంచేటి తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. కోచ్ జీవీ రామిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రమం తప్పకుండా చేసిన సాధన, కఠోర శ్రమకు పతకాలు నిదర్శనమని అన్నారు. తమ క్రీడాకారులను రోటరీ రివర్‌సైడ్ ఆధ్వర్యంలో సన్మానించడం ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని తెలిపారు.

# నంద్యాలలో ఈ నెల 20న జరిగే జిల్లా ప్రధమ మహాసభను జయప్రదం చేయండి

## – ఏపీడబ్ల్యూజేఎఫ్



**బనగానపల్లె సెప్టెంబర్ =3 ప్రజాజ్యోతి** ఈనెల 20వ తేదీన నంద్యాలలో జరిగే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏపీడబ్ల్యూజే ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్ బనగానపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆంధ్ర అక్షర రామచంద్రారెడ్డి సూర్య నరసింహారెడ్డి లు పిలుపునిచ్చారు. గురువారం బనగానపల్లె నియోజకవర్గం లోని కొలిమిగుండ్ల, అవుకు, కోవెలకుంట్లలలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి భద్రత కోసం యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈనెల 20వ తేదీన నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల లోని వివేకానంద ఆడిటోరియంలో జరిగే నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ,వివిధ పార్టీల జిల్లా అధ్యక్షులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్చార్జి జయరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు జిల్లాలోని జర్నలిస్టులు అందరూ హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సంఘాన్ని బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని సంఘ కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు వెల్ఫేర్ ఫండ్ రూ .50 కోట్లు కేటాయించాలని, ఇళ్ల స్థలాలు, చిన్న పత్రికల జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం , రైల్వే పాసుల పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రథమ మహాసభలో జర్నలిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంజామల నాగేంద్ర, నగేష్ కొలిమిగుండ్ల జర్నలిస్టులు పల్లోళ్లి శేఖర్ బాబు, రమణయ్య, నాగేంద్ర, నవీన్, సురేష్ లింగాధర్, పెద్దరాజు .అశోక్ కుమార్. విజయ్ కుమార్, గోపాల్ అవుకు జర్నలిస్టుల ఎస్ .శ్రీనివాసులు, జీవీ సుబ్రహ్మణ్యం ,చిన్న ,శివ జయరాముడు, కోవెలకుంట్ల జర్నలిస్టులు, ఏబీఎన్ రమణ పుల్లయ్య, నాగేశ్వరరావు, సుధాకర్ ,ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల అరెస్ట్ దుర్మార్గం




## -ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేసేవరకు పోరాటం.

## -యుటిఎఫ్ నాయకుల హెచ్చరిక

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని, విద్యాహక్కు చట్టం 23(1) సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ విజయ వాడలోని విద్యాభవన్ వద్ద ఆందోళన చేపట్టిన యుటిఎఫ్ నాయకుల్ని అరెస్టు చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, ఐక్య ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ టి.శివప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ వీరదాసరి క్రిస్టఫర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బద్వేలులోని స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద విజయవాడలోని విద్యా భవన్ వద్ద ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు కె.సుధాకర్, టి.శివ ప్రసాద్, వీర దాసరి క్రిస్టఫర్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నేతలను, ఉపాధ్యాయులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో సమస్యలపై నిరసన తెలియజేసే హక్కు ప్రతి పౌరునికి ఉందనే విషయం పాలకులు గుర్తెరగాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా తీసుకొని 30 ఏళ్లు పైబడి సర్వీసు పూర్తిచేసిన ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష పాస్ కావాలని, లేదా ఉద్యోగం వదులుకోవాలని నిబంధన విధించడం సరికాదన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయు లను టెట్ నుండి మినహాయించేందుకు విద్యాహక్కు చట్టం-2010 సెక్షన్ 23 (1) కి సవరణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్న పాలకవర్గాలు పట్టించుకోకపోవడం తగదన్నారు. 50 ఏళ్ల వయసు పైబడిన ఉపాధ్యాయులు ఒకవైపు పాఠశాలలో విద్యా బోధన చేస్తూ, మరోవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ, వయసు రీత్య వచ్చిన అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఈ వయసులో ఆన్లైన్ విధానం ద్వారా టెట్ పరీక్షను రాసి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమేనా అని వారు ప్రశ్నించారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని, స్పెషల్ టెట్ విధానాన్ని ఆఫ్ లైన్ పద్ధతిలో నిర్వహించాలని, 40% మార్కులను ఉత్తీర్ణతగా పరిగణించాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఒకవైపు ఉపాధ్యాయుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటిస్తూనే, మరోవైపు కూటమి ప్రభుత్వం టెట్ పేరుతో ఉపాధ్యాయుల మెడపై కత్తి పెట్టడం దారుణమన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసిందని, ఆ వైపుగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ చితశుద్ధిని తేటతెల్లం చేస్తున్నదని వారు పేర్కొన్నారు. విజయవాడలోని విద్యా భవన్ వద్ద చేపట్టిన ఆందోళనలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులతో సహా జిల్లాకు చెందిన 40 మందిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించారన్నారు. ఉపాధ్యాయుల ఉద్యమాలను అక్రమ అరెస్టులతో అణిచివేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకా నికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయించేందుకు, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి విద్య హక్కు చట్టం 23 (1) కి చట్ట సవరణ చేయాలన్నారు. అప్పటివరకు స్పెషల్ టెట్ నిర్వహించా లని, అందులో 40% మార్కులను అర్హతగా పరిగణించాలని, ఆఫ్ లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు, గోపవరం మండలాల యుటిఎఫ్ నాయకులు ఎస్.మస్తాన్ వలి, ఎం.రామచంద్రయ్య, బి.ఓబన్న, వై.రామయ్య, ఎ.లాజరస్, ఎం.గుర్రయ్య, కె.శ్రీనివాసులు, డి.కొండయ్య, ఎం.శివ కుమార్, ఎన్.కొండయ్య, వెంకట సుబ్బయ్య, నరసింహ నాయుడు, ఎం.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుచీరలో ఘనంగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

భవిష్యత్ కార్యాచరణపై చర్చ

40 మంది దైవజనుల హాజరు

ఆడియో తెలుగు బైబిళ్లు, వాటర్ ఫిల్టర్ల పంపిణీ


ఎటపాక మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో పాల్గొన్న దైవజనులు, సేవకులు

**ఎటపాక, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఎటపాక మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సమావేశం గురువారం మండలంలోని పట్టుచీర గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పోలవరం జిల్లా పాస్టర్ ఉయిక పీటర్ సింగయ్య దొర ఆధ్వర్యంలోని కృపా గాస్పెల్ చర్చి ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 40 మంది దైవజనులు, సేవకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ కె. ప్రకాష్ దొర అధ్యక్షతన సూరంపాలెంలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్‌లో నిర్వహించిన సమావేశంలో ఫెలోషిప్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. మండలంలోని క్రైస్తవ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు, ప్రజలకు ఆధ్యాత్మిక సేవలు అందించే విధానంపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న ఫెలోషిప్ నాయకులు, సేవకులు, విశ్వాసులకు విలువైన ఆడియో తెలుగు బైబిళ్లు, వాటర్ ఫిల్టర్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ఈ పంపిణీ కార్యక్రమానికి దైవజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ బి. ప్రేమభూషణం, ఎటపాక మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ. బి. శామ్యూల్, వైస్ ప్రెసిడెంట్ జి. ఆమోసు, కార్యదర్శి ఏ. గిరిబాబు, జాయింట్ సెక్రటరీ డి. ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులను ఫెలోషిప్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన దైవజనులు, సేవకులు, విశ్వాసులకు రాజవొమ్మంగి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ సమావేశం లో పెద్ద సంఖ్యలో దైవజనులు పాల్గొనడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సమావేశం విజయవంతంగా నిర్వహించడంతో ఫెలోషిప్ నాయకులు, సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## రావి ఆకుపై సూక్ష్మక్షత్రం.



**ముత్తుకూరు ,సెప్టెంబర్ 3( ప్రజా జ్యోతి)** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సూక్ష్మ చిత్రకారుడు, తెలుగు ఉపాధ్యాయుడు సోమ పద్మ రత్నం రావి ఆకుపై శ్రీకృష్ణుని చిత్రాన్ని సూక్ష్మ రూపంలో గురువారం చిత్రీకరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి హిందూ ఇతిహాసాలలో శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినమని సూక్ష్మ చిత్రకారుడు తెలిపారు. జన్మాష్టమి లేదా గోకులాష్టమి అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారని తెలియజేశారు.

## 30 ఏళ్లుగా రహదారి కోసం ఎదురు చూపులు!..

రాజుపేటకాలనీ,తోటపల్లిలో అధ్వాన్నంగారోడ్లు!..

శిథిలావస్థలో అంగన్వాడీ కేంద్రాలు!..





**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**రాజుపేట కాలనీ,తోటపల్లి గ్రామాల్లో బురదతో నెలకొన్న రహదారులు అద్వాన్నంగా అంగన్వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించా లని కోరుతూ, గ్రామస్థులు గురువారం, వి.ఆర్.పురం, ఎం.పీ.డీ.వో, కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులకు, ఎం.పీ.డీ.వో ఇమాన్యుయల్, ఎం.పీ.పీ కారం లక్ష్మి, జడ్పీ.టీ.సీ వాళ్ల రంగారెడ్డి కిసమస్యలపై వినతిపత్రం అందజేశామని, తోటపల్లి, రాజుపేట గ్రామస్తులు తెలిపారు. రాజుపేటకాలనీ ఏర్పడి సుమారు30 ఏళ్లు గడుస్తున్నా, ప్రధాన రహదారికి నేటికీ నూతన రోడ్డు నిర్మాణం జరగలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తోటపల్లి గ్రామంలోని అంతర్గత రహదారులు సైతం అధ్వాన్నంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,రెండు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరాయని, వర్షాకాలం లో భవనాల్లోకి నీరు చేరుతున్నందున,చిన్నారుల భద్రత దృష్ట్యానూతన భవనాలు నిర్మించాలని కోరారు.గత ఐదేళ్లుగా బోరింగ్ ప్లేట్లు ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు, మురుగునీరు నిలిచి,దోమలబెడద పెరుగుతోందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బోరింగ్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వరదల సమయంలో రాజుపేట కాలనీకి వెళ్లే రెండు ప్రధాన రహదారులు ముంపునకు గురవుతున్నాయని, రాజుపేట,మధ్యలోని వరద రహదారిని నూతన రహదారిగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో రేవు సింహాచలం ముత్యాల భాను, సోడి మల్లయ్య,సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతపై అక్రమ కేసులా? భేషరతుగా ఎత్తివేయాలి

**-- నంది రైతు సమాఖ్య**

**నంద్యాల =సెప్టెంబర్=03 ప్రజాజ్యోతి** సాగునీరు, తాగునీరు ఇవ్వాలని అడిగితే... నీరు విడుదల చేయాల్సిన ప్రభుత్వమే, అన్నం పెట్టే రైతులపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయం? ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వెళ్లిన రైతులపై, వారికి మద్దతుగా నిలిచిన మాజీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని 'నంది రైతు సమాఖ్య' అత్యంత తీవ్రంగా, కన్నీటి పర్యంతమై ఖండిస్తోంది! "రైతులు రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించలేదు, వినాశనం కోరలేదు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి, పశువుల దాహార్తి తీర్చడానికి నీళ్లివ్వమని వేడుకోవడమే మేము చేసిన నేరమా?" అని నంది రైతు సమాఖ్య నాయకులు గళమెత్తారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే గేట్లు వేసి అడ్డుకోవడం, శాంతియుతంగా రోడ్డుపై కూర్చుంటే... ఏకంగా 35 మందిపై కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏమీ నిషేధిత ప్రాంతం కాదు, రైతులేమీ నేరస్థులు కారన్నారు. స్థానిక మంది రైతు సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శంకర్ నాయక్ మాజీ సర్పంచ్ కోటిరెడ్డి ఎర్రన్న మీడియా సమావేశం నిర్వహించారు.



**నంది రైతు సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ..శ్రీశైలంలో నీళ్లున్నా... రైతుల గుండెల్లో మంటలా**

రాయలసీమ ప్రాంత ప్రాజెక్టు అయిన శ్రీశైలంలో ఏకంగా 175 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పటికీ, దిగువకు నీటిని విడుదల చేయకుండా రోజులు గడుపుతుంటే రైతాంగం ఎలా తట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు లేక, సాగునీరు అందక రైతులు, ప్రజలు, పశువులు అల్లాడిపోతున్నాయన్నారు. సెప్టెంబర్ 15 నుండి ప్రారంభమయ్యే రబీ సీజన్ లో 100 రోజుల పంటలు సాగు చేసుకోవడానికి వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. నాడు కమతాల్లో చెమటోడ్చి దేశానికే అన్నం పెట్టిన రైతు... నేడు హక్కుల కోసం, ప్రాణాధారమైన నీటి కోసం రోడ్డెక్కితే వేధింపులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం? రైతులపై, వారికి అండగా నిలిచిన ప్రజాప్రతినిధులపై బనాయించిన అక్రమ కేసులను జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వం వెంటనే, బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరారు. కక్షసాధింపు చర్యలు మాని, తక్షణమే దిగువకు సాగు, తాగునీటిని విడుదల చేసి రైతాంగాన్ని, రాయలసీమను కరువు కోరల నుండి కాపాడాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు!

# బడుగువానిలంక నదీ కోత నివారణకు అడ్డుకట్ట పడింది

**రూ.63.83 కోట్లతో గ్రోయిన్స్,రివిట్మెంట్ నిర్మాణం.**

**ఆలమూరు సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి):**గత ఏడాది వరదలకు ఆ గ్రామస్తులంతా బిక్కుబిక్కుమంటే ఉన్నారు. రైతుల కళ్లెదుటే లక్షలాది రూపాయల విలువైన తమ భూములు నదీ గర్భంలో కొట్టికుపోతుంటే అల్లాడిపోయారు. భవిష్యత్తుపై అంతులేని బెంగ పెట్టుకున్నారు. కాని కాలం కలిసి వచ్చింది.నదీకోతకు గురికాకుండా భూముల రక్షణకు పటిష్టమైన గ్రోయన్స్ నిర్మించారు.రిలయన్స్ పైపులైన సంస్థ సహకారంతో రూ.63.83 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. వివారాల్లోకి వెలితే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలో కోట్లాది రూపాయలు విలువైన వందల ఎకరాల లంక భూములు నదీ గర్భంలో కలిసిపోయాయి.ఆ గ్రామంలోని పుష్కరాల రేవుకు అటు ఇటు 2007 సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఆలమూరు ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి ఆధ్వర్యంలో రివీట్మెంట్లు,గ్రోయిన్స్ నిర్మించారు. దాంతో ఆ ప్రాంతంలో కోత నివారణ ఆగింది. అనంతరం రిలయన్స్ పైపు లైన్ నిర్మించిన ప్రాంతంలో అధికంగా కోతకు గురవడం మొదలుపెట్టింది. దీనిపై రిలయన్స్ అనుబంధ సంస్థ పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(పిఐఎల్) వారు 2023లో కిలోమీటర్నర పొడవునా రూ.41.63 కోట్లతో అప్పటి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రివిట్మెంట్ నిర్మించారు. కాని అది ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. వరదలకు ఆ రాతి రివిట్మెంట్ లేచిపోయి పంట పొలాలను కోతకు గురి చేసింది. గ్రోయిన్స్ లేకుండా కేవలం రివిట్మెంట్ నిర్మించడం వల్ల నదీ ప్రవాహ వత్తిడిని తట్టుకోలేక పోయింది. దీనిపై ఇరిగేషన్ హెడ్ వర్క్స్ ఇంజనీర్లు వారు సరైన అవగాహన లేక ఆ విధంగా డిజైన్ చేసారు.ఫలితంగా గతేడాది వరదలకు రివిట్మెంట్ డొల్లతనం బయటపడింది. దీంతో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ద్వారా రిలయన్స్ సంస్థ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితిని గుర్తించిన ఆ సంస్థ వారు రూ. 63.83 కోట్లు మంజూరు చేశారు. స్థానిక ఇంజనీరింగ్ అధికారులు కాకుండా చెన్నై ఐఐటి విద్యార్థులతో ఈ గ్రోయిన్స్ ను డిజైన్ చేయించారు. పూర్తి పటిష్టంగా రాతి కట్టడంతో వీటిని నిర్మించారు.పాత రివిట్మెంట్ నుంచి మొదటి గ్రోయిన్ ధవళేశ్వరం బ్యారేజ్ వైపు 40 మీటర్ల పొడవునా గోదావరి నదిలోకి నిర్మించారు. అలాగే రెండవ, మూడవ గ్రోయిన్స్ ను 45 మీటర్లు పొడవన నిర్మించారు. చివరగా నాలుగవ గ్రోయిన్ రావులపాలెం వైపు 30 మీటర్ల పొడవునా నిర్మించారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నేరుగా విడుదలయ్యే వరద నీటి ప్రవాహ వేగాన్ని నియంత్రించడం ద్వారా కోత నివారణకు అడ్డుకట్ట పడింది. అంతేకాకుండా గత వరదల కాలంలో పూర్తిగా ధ్వంసమైన 125 మీటర్ల రివిట్మెంట్ ను పటిష్ఠ పరిచారు.గత నెలలో వచ్చిన వరదలకు ఆ ప్రాంతం ఏమాత్రం చెక్కుచెదరలేదు.ఈ రాతి కట్టడాలు పూర్తిగా నదీకోతకు అడ్డుకట్ట వేసాయి. అలాగే ఇంత పెద్ద మొత్తంలో పనులు జరగడానికి వేలాది వాహనాలు ద్వారా మెటీరియల్ ను తరలించారు. ఈ వాహనాలు రావడానికి అనుకూలంగా కాంట్రాక్టు సంస్థ పెద్ద ఎత్తున పుంత రోడ్లును పటిష్ఠ పరిచింది. ఫలితంగా ఆ ప్రాంతం రైతులకు మెరుగైన రహదారుల సదుపాయం ఏర్పడింది. మొత్తానికి ఇక్కడ నదీ కోత నివారణకు సహకరించిన రిలయన్స్ పైపు లైన్ సంస్థకు,కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు,జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తదితర అధికారులకు బడుగువాని లంక గ్రామస్థులు, రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.






# పర్యాటక సిరికి పచ్చదనం తోడు సూర్యలంక అభివృద్ధికి అడుగులు

**బీచ్, మడ అడవులు, సఫారీ అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిశీలన**

**బాపట్ల సెప్టెంబరు 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** సహజ అందాలకు నెలవైన సూర్యలంకను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బీచ్ అభివృద్ధి, గ్రీన్ బెల్ట్, గ్రీన్‌వాల్, మడ అడవుల విస్తరణ, సఫారీ అభివృద్ధి వంటి అంశాలను సమన్వయం చేస్తూ సూర్యలంక ప్రాంతానికి సమగ్ర రూపు తీసుకురావడంపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు ప్రారంభమయ్యాయి.ఈ నేపథ్యంలో ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ కొణిదల నాగేంద్రరావు (నాగబాబు), జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చలపతిరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కలిసి గురువారం సూర్యలంక అటవీశాఖ నగర వనంలో మొక్కలు నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.తీర ప్రాంత సహజ వనరులు, వాటి పరిరక్షణ, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై అధికారులు వివరించిన నివేదికను పరిశీలించారు. సూర్యలంక నగర వనం నుంచి పొగురుదిబ్బ వరకు బోటులో ప్రయాణించిన నాగబాబు, మార్గమధ్యంలో మడ అడవులను పరిశీలించారు. పొగురుదిబ్బ వద్ద తాటి విత్తనాలు నాటారు. విద్యార్థులతో ముచ్చటించి వారిని అభినందించడంతో పాటు వారితో ఫొటోలు దిగారు.పర్యాటకంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యంసూర్యలంక ప్రాంతంలోని గ్రీన్‌వాల్, గ్రీన్‌బెల్ట్ నిర్మాణ పనులను పరిశీలించేందుకు బాపట్లకు వచ్చినట్లు నాగబాబు తెలిపారు. తీర ప్రాంతాల్లో బీచ్‌ల అభివృద్ధితో పాటు మడ అడవుల విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. తీరప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడం వల్ల ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.సూర్యలంక వంటి ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెరిగితే పక్షుల ఆవాసాలు విస్తరించడంతో పాటు జీవవైవిధ్యం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. బాపట్ల జిల్లాలో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణ, ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ విజయవంతంగా కొనసాగుతుండటాన్ని ఆయన అభినందించారు.జంతుజాల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సఫారీ అభివృద్ధిని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో ఉన్న సహజ వనరులను సమర్థంగా వినియోగించుకుంటే భవిష్యత్‌లో జిల్లా పర్యాటక కేంద్రంగానే కాకుండా పర్యావరణ పరిరక్షణకు ఆదర్శ తీరప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.అభివృద్ధి ప్రణాళికలను వివరించిన కలెక్టర్సూర్యలంక బీచ్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి నాగబాబు, పీసీసీఎఫ్ చలపతిరావుకు వివరించారు. ప్రాంత అభివృద్ధికి సంబంధించిన నివేదికను అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మొక్కలు నాటించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ ఏ.హరికుమార్, జిల్లా అటవీశాఖ అధికారి సౌజన్య జాస్తి, అటవీశాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దూరదృష్టి ఉన్న నాయకుడు మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**....సీనియర్ నాయకులు ఆడివప్ప గౌడ్,టిబిపి చైర్మన్ టిప్పుసుల్తాన్**

**లెనినో ప్రభావం ఉన్న ఎలాంటి కొరత లేకుండా అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం.. మండల అధ్యక్షులు సురేష్ నాయుడు**



**కౌతాళం, సెప్టెంబర్ 02 ప్రజా జ్యోతి** నిన్నటి రోజున ఎల్ఎల్సి ద్వారా మంత్రా లయం టీడీపీ ఇంచార్జీ ఎన్. రాఘ వేంద్ర రెడ్డి సహకారంతో అన్నదాతను ఆదుకుంటాం టిప్పు సుల్తాన్ సురేష్ నాయుడు తుంగభద్ర దిగువ కాలువ కింద సాగుచేసిన పంటలకు సాగునీరు అందించి అన్నదాతకు ఆదుకుంటామని తుంగభద్ర బోర్డు ప్రాజెక్టు చైర్మన్ టిప్పు సుల్తాన్ టిడిపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడు తెలిపారు.బుధవారం మండల పరిధిలోని 74, 75, కౌతాళం మేజర్, మాధవరం మేజర్( హోల్వి సెక్షన్) డిస్ట్రిబ్యూటర్లను నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సహకారంతో ప్రస్తుతం రైతులు సాగుచేసిన ఆరుతడి పంటల కోసం సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఆయకట్టు రైతులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాధినేహల్ సొసైటీ చైర్మన్ బోయ మారెప్ప డైరెక్టర్ నరసింహ,డబ్ల్యూ ఏ మెంబర్ వీరేష్,షేక్షావలి,శివ చూడి,లింగేష్,ఈరణ్ణ, నాగలింగ, వర్మ,శివశంకర్ గౌడ్ మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## నంద్యాల జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు

**-సాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి నిమ్మల సానుకూల హామీ**



**నంద్యాల:సెప్టెంబర్=03 ప్రజాజ్యోతి అమరావతి:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలో రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని జిల్లా ప్రజలకు త్రాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ ఎమ్ డి ఫరూక్ బీసీ జనార్ధన్ రెడ్డి ,ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి , గౌరు చరిత రెడ్డి బుడ్డా రాజశేఖర్ రెడ్డి గిత్త జయసూర్య ,రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు గారిని కోరారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు గారిని కలిసి, వర్షాలు సకాలంలో లేకపోవడంతో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరారు.రైతులు మరియు జిల్లా ప్రజల త్రాగు నీరు సమస్యపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి, రైతులకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు

## పెరటితోటల పెంపకం పై అవగాహన కార్యక్రమం




**ప్యాపిలి సెప్టెంబర్ 03 ప్రజాజ్యోతి న్యూస్** ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఐసిడిఎస్ వారి సహకారంతో మహిళలకు పెరటి తోటల పెంపకం పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ , కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియా మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆరోగ్యపరమైన జాగ్రత్తలు చాలా అవసరమని, సమతుల ఆహారం, పోషక విలువలు, పెరటి తోటల ప్రాముఖ్యతలను మహిళలకు వివరించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీనా రాయణమ్మ , శాస్త్రవేత్త లక్ష్మీ ప్రియ ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీకార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగు దేశం



**నంద్యాల సిరివెళ్ల:సెప్టెంబర్ =03 ప్రజాజ్యోతి** తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లో భాగంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే శ్రీమతి శ్రీ భూమా అఖిల ప్రియా రెడ్డి గారి ఆదేశాలతో సిరివెళ్ల మండల పార్టీ అధ్యక్షులు శ్రీ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సిరివెళ్ల మండలం మోత్కపల్లి గ్రామ సర్పంచ్ భూమా వేణుగోపాల్ రెడ్డి గారి మరియు సిరివెళ్ల మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శివరాం రెడ్డి గారి ఆధ్వర్యం లో మోత్కులపల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించినందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే శ్రీమతి భూమా అఖిలప్రియ గారికి సిరివెళ్ల మండల పార్టీ అధ్యక్షులు శ్రీ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు

## శ్రీకృష్ణుని జీవితం మానవాళ్ళకి మార్గదర్శకం

**మాధురి స్కూల్ కస్పాండెంట్: కదారి తమ్మి నాయుడు..**



**శంఖవరం సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి న్యూస్)** కత్తిపూడిలోని మాధురి విద్యాసంస్థలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు బాలకృష్ణుడు, రాధాదేవి, గోపికల వేషధారణలో కనువిందు చేశారు. విద్యార్థులచే కృష్ణ లీలలు, భజనలు, కోలాటాలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధురి విద్యాసంస్థ కరస్పాండెంట్ కదారి తమ్మినాయుడు మరియు నాగార్జున, డైరెక్టర్లు కదారి సీతాదేవి విద్యార్థులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ తమ్మి నాయుడు మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం మానవాళికి మార్గదర్శకమని అన్నారు. బాల్యంలోనే ఎన్నో అద్భుత లీలలు చూపిన కృష్ణుడు, పెరిగి పెద్దయ్యాక భగవద్గీత ద్వారా కర్మయోగాన్ని, ధర్మాన్ని బోధించాడని తెలిపారు. సత్యం, ధర్మం, ప్రేమ, త్యాగం, స్నేహం వంటి గుణాలకు కృష్ణుడు ప్రతీక అని, విద్యార్థులు ఆయన ఆదర్శాలను అలవర్చుకోవాలని గీతలో కృష్ణుడు చెప్పిన కర్మణ్యేవాధి కారస్తే మా ఫలేషు కదాచన" అనే శ్లోకాన్ని విద్యార్థులు జీవితంలో పాటించాలని, ఫలితం ఆశించకుండా కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాధురి విద్యాలయ ప్రిన్సిపాల్ అచ్యుత రామనారాయణ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెనుమదం గ్రామ సభలో గ్రామ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ఆమోదం.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 3.** పోడూరు మండలం పెనుమదం లో రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగముగా పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేక అధికారి సయ్యద్ మౌలానా పాజిల్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో బీసీ యస్ సి యస్ టి, ఇతర ఓటర్లను నిర్ధారించి గ్రామ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ను ఆమోదించారు. పెనుమదం గ్రామంలో పంచాయతీ ఎన్నికలు జరుపుటకు గాను 14 పోలీస్ స్టేషన్లు ఉండగా 6341 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 3086 దీజ ఓటర్లు , 1984 రాజ ఓటర్లు, 14 రా ఓటర్లు మరియు1257 మంది ఇతర ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తానేటి బాబురావు నీటి సంఘం అధ్యక్షులు దేవరపు దొరబాబు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, ఉప సర్పంచి పీతాని శ్రీను, కూటమి నాయకులు గ్రామ ప్రజలు ఈ గ్రామ సభలో పాల్గొన్నారు.

## ఓలేటి రాజు అకాల మరణానికి చింతిస్తూ వారి చిత్రపటానికి నివాళులర్పించిన అమలాపురం అసెంబ్లీ ఇన్చార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్



**అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడ సకుర్ర గ్రామం ప్రజా జ్యోతి ప్రతినిధి** ఓలేటి రాజు గారి అకాల మరణానికి చింతిస్తూ వారి చిత్రపటానికి నివాళులర్పించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసివారి కుటుంబ సభ్యులను ఓదార్చడమే కాకుండా వారికి ఏ కష్టం వచ్చినా నేనుంటాను అని వారికి మనోధైర్యాన్ని కలగజేసిన అమలాపురం కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ వారితోపాటు వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఆర్టిఐ జోన్ టు అధ్యక్షులు కొల్లు రవీంద్ర వర్మ మరియు కోలా ధర్మరాజు బొంతు శ్రీనివాసు పెమ్మాడి సురేంద్ర ఇల్లింగి సత్తిబాబు కొప్పడి రఘువర్మ ఇల్లంగి శ్రీను తమ్ముడు తాళ్ల వీరబాబు ధర్మాడి రాము వాత్తాడి వెంకటేష్ కోలా మహంకాళి రాజు కప్పిడి రాజు కోలా సంజీవ్ తదితరులు ఓలేటి రాజు వారి ఆత్మ శాంతించాలని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

## గొల్లప్రోలు మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా విడుదల



**గొల్లప్రోలు: (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పురపాలక సంఘం పరిధిలోని 23 వార్డులకు సంబంధించిన ఫోటో ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం (సెప్టెంబర్ 3, 2026) ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా ప్రచురించినట్లు మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, విజయవాడ వారి సర్క్యులర్ నెం.401/1/2026-2 (తేది.12.08.2026) ఆదేశాల ప్రకారం ఈ జాబితాను సిద్ధం చేశా రు. జనవరి 1, 2026 నాటిని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని, పురపాలక సంఘం లోని 23 వార్డులకు విడివిడిగా ఈ ఫోటో ఎలెక్టోరల్ ఓటర్ల జాబితాలను తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రొఫార్మా-1 లో ఈ వార్డుల వారీ జాబితాలను ప్రజల పరిశీలన కోసం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు. ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవాలని కోరారు.

# రైతుల భూ వివరాలను సరిచేయాల్సిందే

- తంద్యాం లో పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్
- రైతుల భూ వివరాల్లో తప్పులపై అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ , ఎమ్మెల్యే కూన రవికుమార్
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం పై కలెక్టర్ కు , సీసీ.ఎల్. ఏ కు పిర్యాదు చేస్తానని హెచ్చరిక
- వివరాలను సరిచేసిన తర్వాతనే పాసుపుస్తకాలు పంపిణీ రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదు





**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్:** తంద్యాం గ్రామంలో పాసుపుస్తకాల పంపిణీ నిలిపివేత రైతుల భూ వివరాల్లో తప్పులపై రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం పొందూరు మండలం తంద్యాం గ్రామంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని కార్యక్రమాన్ని రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ ,ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నిలిపివేశారు. భూముల రీ-సర్వేలో భాగంగా రైతుల భూముల వివరాలు తప్పుగా నమోద య్యాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేకపోవడంపై అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సర్వే రికార్డులు సక్రమంగా లేకుండా పాసుపుస్తకాలు ఎలా పంపిణీ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అన్యాయం జరిగేలా రికార్డుల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు, అమరావతిలోని సీసీఎల్ఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. బాధ్యులైన తహసీల్దార్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్‌పై చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామన్నారు. రైతుల భూముల వివరాలు పూర్తిగా పరిశీలించి, తప్పులను సరిచేసిన తర్వాతే పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా భూముల రికార్డులను సక్రమంగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో తంద్యం గ్రామంలో జరిగిన భూముల రీ-సర్వే సమయంలోనే పలు తప్పులు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. గతంలో గ్రామంలో వీఆర్వోగా పనిచేసిన శంకర్‌రావు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారని, ఆయన హయాంలోనే రైతుల భూముల వివరాల్లో తప్పులు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, తప్పులు ఎక్కడ జరిగాయో గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రైతుల భూములకు సంబంధించిన రికార్డులు సరిచేసిన తరువాతనే పాసుపుస్తకాల పంపిణీ చేపడతామని స్పష్టం చేశారు. ఈ మేరకు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నుంచి ఎమ్మెల్యే రవికుమార్ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో టి. ఎన్.ఎస్. ఎఫ్ ప్రధాన కార్యదర్శి గుర్రాల సుమంత్ , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, టిడిపి మండల ఉపాధ్యక్షులు బాదాన శేషగిరి, తంద్యాం గ్రామ మాజీ సర్పంచ్ కిలారి భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం పక్కా స్కెచ్ సుపారీ ఇచ్చి హత్య



**గుంటూరు సెప్టెంబరు 3 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఆస్తి వివాదం ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. ముందస్తు పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి, సుపారీ గ్యాంగ్ సహాయంతో వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనను తెనాలి రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో హత్యకు సుపారీ ఇచ్చిన వ్యక్తితో పాటు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, మృతదేహాన్ని వెలికితీశారు. చుక్క కోటి వీర నాగయ్య అలియాస్ నాగ మహేష్ (53) తెనాలిలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబానికి దూరంగా మరో మహిళతో సహజీవనం చేస్తున్న నేపథ్యంలో ఆస్తుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. మహేష్ తన భార్య, పిల్లల పేరున ఆస్తులు రాయకపోవడంతో అతడి బావమరిది పగడాల రాజేష్ అతడిపై కక్ష పెంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహేష్‌ను హత్య చేస్తే ఆస్తి తన అక్క, పిల్లలకు దక్కుతుందనే ఉద్దేశంతో రాజేష్ ఓలేరు గ్రామానికి చెందిన కొమరబత్తిని సందీప్‌ను సంప్రదించి రూ.4 లక్షలకు సుపారీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సందీప్ తన అనుచరులు బుస్సా సంజయ్, కొప్పుల అపర్ణ అలియాస్ బుజ్జి, దేవరకొండ మారుతి వర ప్రసాద్‌తో కలిసి తెనాలిలో బస చేసి మహేష్ కదలికలను గమనించారు. ఆగస్టు 29న మహేష్ బైక్‌పై సోమసుందరపాలెం వైపు వెళ్తుండగా అద్దెకు తీసుకున్న టాటా నెక్సన్ కారులో బలవంతంగా ఎక్కించుకున్నారు. అనంతరం కరకట్ట మార్గంలో రేపల్లె వైపు వెళ్తుండగా కారులోనే అతడిని హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మృతుడి వద్ద ఉన్న బంగారు గొలుసు, ఉంగరాన్ని తీసుకున్న నిందితులు మృతదేహాన్ని ఓలేరు సమీపంలోని ఇసుక క్వారీ వద్ద పాతిపెట్టారు. మహేష్ కనిపించకపోవడంతో అట్టలూరి దీప్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. ఆధారాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి సెప్టెంబరు 2 రాత్రి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి సమాచారంతో గురువారం ఓలేరు వద్ద మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన టాటా నెక్సన్ కారు, 32 గ్రాముల బంగారు గొలుసు, బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్, ఎస్సైలు ఆనంద్, ప్రసాద్ తదితర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. నిందితులపై తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.

# వేడంగిలో ఘనంగా జరిగిన పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



**పోడూరు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 3.** పోడూరు మండలం వేడంగిలో శివాలయం సెంటర్ వద్ద మంగళవారం రాత్రి జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలను జనసేన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా భారీ కేకును జనసేన నాయకులు కట్ చేసి అందరికీ పంచారు జనసేన సీనియర్ నాయకులు యినుకొండ రంగారావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ జనసేన సైనికులు ఘనంగా జరపటం అభినందనీయమన్నారు. పలుచోట్ల రక్తదాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలలో యువత ఎంతో ఉత్సాహంగా ముందుకు వచ్చి పాల్గొనటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు ఎంపీటీసీ యర్రంశెట్టి వెంకట నరసింహారావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తో పాటు వారి సోదరులు చిరంజీవి నాగబాబు రాజకీయ రంగంలో అడుగుపెట్టక ముందునుండి సేవా దృక్పథం గలవారన్నారు. వారి కుటుంబం సినిమా రంగంలో పేరు పొందటమే కాకుండా సేవలు అందించడం లోను అంత పేరు తెచ్చుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆదరణ చూరగొం టున్నారన్నా రు. సీనియర్ జనసేన నాయకులు బొలిశెట్టి నాగ రమేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్, అటవీ శాఖను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. దేవస్థానం చైర్మన్ రేఖపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలలోనూ జన సైనికులు జనసేన పార్టీ విజయానికి కృషి చేసి తన సత్తా చాటాలన్నారు. జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు కొర్రకూటి హరి నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారా లోకేష్ లతో కలిసి రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. సభానంతరం ఏర్పాటు చేసిన విందు భోజనంలో జన సైనికులు అభిమానులు యువత చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిఅన్న సమారాధన జరిపారు. నీటి సంఘం ఉపాధ్యక్షులు యర్రం శెట్టి వెంకట నరసింహారావు జనసేన గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులు యర్రంశెట్టి వీర వెంకట సత్యనారాయణ (అన్నవరం) కమిటీ సభ్యులు కూనపరెడ్డి శ్రీనివాసరావు చిన్న నల్లి వెంకటేశ్వరరావు యడ్ల ప్రసాద్ బోణం శ్రీను చెల్లబోయిన వెంకట రత్నం పోడూరి అనిల్ యర్రంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్స్ కాలనీ దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి కంబాల రూ. లక్ష విరాళం



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) సెప్టెంబర్ 03:** గోకవరం గ్రామం డ్రైవర్స్ కాలనీలో కొలువై ఉన్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు అండగా నిలిచారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించి, అందులో భాగంగా తొలి విడతగా రూ.లక్ష విరాళం చెక్కును అందజేశారు. రాబోయే దేవి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని, శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి రంగులు వేయడంతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కంబాల శ్రీనివాసరావుని కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన కంబాల శ్రీనివాసరావు ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. దీనిలో భాగంగా తొలి విడతగా రూ.లక్ష చెక్కును బుధవారం రాత్రి గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలకు అందజేశారు. ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు తెలిపారు. దేవి నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందించడానికి ముందుంటానని పేర్కొన్నారు. కంబాల శ్రీనివాసరావు అందించిన సహాయానికి ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి చేయూతనందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు...

# ఐదేళ్లుగా చీకట్లోనే!.. అధికారులకు కనిపించదా?..

**త్రీఫేస్ కరెంట్ ఇవ్వక పోతే ఐ.టీ.డీ.ఏ,ముట్టడిస్తాం!..**

**రేఖపల్లి సర్వ సభ్య సమావేశంలో అధికారుల తీరు పై ప్రజాప్రతినిధుల తీవ్రఆగ్రహాం!..**





**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 3(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఐదేళ్లుగా త్రీఫేస్ విద్యుత్ కోసం ఎదురు చూస్తున్న మూడు గ్రామాల ప్రజలబాధలు అధికారులకు పట్టవా?రైతుల పంటలు ఎండిపోతున్నా విద్యుత్ శాఖ ఎందుకు స్పందించడం లేదు? అంటూ, వరరామచంద్రాపురం, మండల ప్రజా ప్రతినిధులు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ఇక సహించేది లేదని, ప్రజలను సమీకరించి ఐ.టీ.డీ.ఏ, కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గురువారం, రేఖపల్లి, ఎం.పీ.డీ.వో, కార్యాలయ సమావేశ మందిరంలో ఎం.పీ.పీ కారం లక్ష్మి,అధ్యక్షతన నిర్వహించిన, సర్వసభ్య సమావేశం అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధులఆగ్రహంతోవాడిగా వేడిగాసాగింది. విద్యుత్, వ్యవసాయం, వైద్యం తదితర కీలక సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఐదేళ్లుగా విద్యుత్ లేదు, ఇదేనా అధికారులపాలన అంటూ, చిన్నమట్టపల్లి ఎం.పీ.టీ.సీ ప్రదీప్ కుమార్, ప్రశ్నించారు. సున్నం వారిగూడెం, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, గ్రామాల్లో ఐదేళ్లుగా త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు.విద్యుత్ లేక తాగునీటి సరఫరాకు ఇబ్బందులు,రైతులకుసాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, ఆరోపించారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.ఇక హామీలతో కాలంగడిపే పరిస్థితిలేదని స్పష్టం చేశారు. తక్షణమే త్రీఫేస్ లైన్ మంజూరు చేయకపోతే ఐ.టీ.డీ.ఏ, కార్యాలయం ముందు భారీదీక్ష చేపట్టి, అవసరమైతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు నష్టపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని,హెచ్చరించారు. శ్రీరామగిరి, మాజీ సర్పంచ్ పులి సంతోష్ కుమార్, మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరో వైపు ఎరువుల కొరత రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను గుర్తించి వి.ఆర్.పురం, మండలాన్ని కరువుమండలంగా ప్రకటించి ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలసమస్యలతో చెలగాట మాడితే ఉద్యమమేనని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, రైతుల భవిష్యత్తుతో ప్రభుత్వం, అధికారులు చెలగాట మాడొద్దని సూచించారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం కొనసాగిస్తే మండల వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతంచేస్తామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు,మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మండలంలోని పీ.హెచ్.సీ.ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజాప్రతినిధులు తీర్మానం చేశారు. మాజీ సర్పంచులకు ఘనసన్మానం చేశారు.సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా మాజీ సర్పంచులను ఎం.పీ.పీ కారం లక్ష్మి,జెడ్పీ.టీ.సీ వాళ్ళ రంగారెడ్డి, ఎం.పీ.డీ.వో స్పెషల్ ఆఫీసర్, పి. ఇమ్మానుయేలు చేతులమీదుగా శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పూనం సరోజిని, వి లక్ష్మి,సవలం మారయ్య, నరసమ్మ, ఎం.పీ.టీ.సీ బంధం విజయలక్ష్మి, వివిధ శాఖలఅధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సమావేశ అధికారిక వివరాలు ఈ విధంగా!.. ఎం.పి.డి.వో!స్పెషల్ ఆఫీసర్ పి ఇమ్మానియల్!..









**వి.ఆర్.పురం, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** వరరామచంద్రాపురం, మండల సర్వసభ్య సమావేశం – అధికారిక వివరాలు ఈ విధంగా తేది 03.09.2026, వేదిక మండల పరిషత్ కార్యాలయం, వి.ఆర్.పురం,ఈరోజు మండల పరిషత్ కార్యాలయం, వి.ఆర్.పురం నందు జరిగిన సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు కారం లక్ష్మి, అధ్యక్షతన సమావేశం చాలా దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం, మండల జడ్పీ.టీ.సీ వాళ్ళ రంగారెడ్డి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి,స్పెషల్ ఆఫీసర్, పి ఇమ్మానియేల్, మండల తహసీల్దార్ వై సరస్వతి, వరరామచంద్రాపురం, ఎస్సై షేక్ సాధిక్,మండల అగ్రికల్చర్, వైద్యఆరోగ్యశాఖ, అధికారులు, హౌసింగ్ డిపార్ట్మెంట్,ఐ.సి.డి.ఎస్,అధికారులు, విద్యుత్ శాఖ, వెలుగు ఏ.పి.ఎం, సుధాకర్, ఎం.పి.టీ.సీ.లు పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

**సమావేశంలో చర్చించిన అంశాలు!..**

ఈ కార్యక్రమంలో మండలంలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మరియు ఇకపై జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి విద్యుత్, అధికారులతో విస్తృతంగా చర్చించడం జరిగింది.

**సన్మాన కార్యక్రమం!..**

ఈ కార్యక్రమం అనంతరంమండలంలోని అందరు మాజీ సర్పంచులకు,గ్రామ అభివృద్ధికి చేసినసేవలను గుర్తింపుగా ఘన సన్మానం చేయడం జరిగింది.

**బెస్ట్ ఎంప్లాయి అవార్డ్ అందుకున్న ఉద్యోగులకు సన్మానం!..**

అదేవిధంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు–2026 సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా బెస్ట్ ఎంప్లాయీ అవార్డు తీసుకున్న మండలంలోని అధికారులు మరియు సిబ్బందిని కూడా సత్కరించడం జరిగింది.సమావేశం ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా ముగిసింది.

# తిమ్మాపురంలో 'వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్' కార్యక్రమం






**కాకినాడ రూరల్ (ప్రజా జ్యోతి)** సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'వన్ మంత్.. వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎంపీడీవో పి. సతీష్, తహశీల్దార్ పోతురాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.తిమ్మాపురం గ్రామంలో గతంలో తొమ్మిది పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఓటర్ల వివరాల్లో కొన్ని ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. 'సర్' కార్యక్రమం ద్వారా ఓటర్ల వివరాలను పరిశీలించి, వారు నివసిస్తున్న ప్రాంతానికి అనుగుణంగా సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధిలోకి చేర్చే ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటర్ల వివరాలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె. సురేష్, మండల సర్వేయర్ రమ్య, ఆర్ఐ భవాని, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజబాబు, వీఆర్వో నున్న సత్యనారాయణతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తూరంగిలో వరి సాగుపై 'పొలం బడి'

**రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన**

**కాకినాడ రూరల్ ప్రజా జ్యోతి:** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి పంటపై 'పొలం బడి' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగులో అధునాతన, శాస్త్రీయ పద్ధతులపై వ్యవసాయ అధికారులు విస్తృత అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వరి పంటలో సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులు, కలుపు నివారణ చర్యలతో పాటు పురుగులు, తెగుళ్ల సమగ్ర సస్యరక్షణపై రైతులకు వివరించారు. పొలం బడి విధానం ద్వారా రైతులు తమ పంటను క్రమం తప్పకుండా స్వయంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పంటకు తెగుళ్లు లేదా పురుగుల ఉధృతిని గమనించి, అవసరమైనప్పుడు మాత్రమే శాస్త్రీయంగా పురుగుమందులను వినియోగించాలని, దీనివల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణాన్ని కూడా రక్షించవచ్చని పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె. దుర్గాలక్ష్మి, వ్యవసాయ అధికారి సిహెచ్. సత్యనారాయణ, సహాయ వ్యవసాయ అధికారి జి. రామకృష్ణ, బి. జై శంకర్‌లతో పాటు స్థానిక ఐడియా కాలేజ్ విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబాలకు అండగా 40 మంది లబ్ధిదారులకు 19.53 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీవీ



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఎమ్మిగనూరులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం 40 మంది లబ్ధిదారులకు మొత్తం 19.53 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 393 మంది లబ్ధిదారులకు సుమారు 3.08 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం రోడ్డు ప్రమాదంలో భార్య బోయ రంగమ్మను కోల్పోయిన ఎమ్మిగనూరు ఎంఎస్ నగర్‌కు చెందిన బోయ కేశన్నకు ?5 లక్షల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ క్లెయిమ్ క్రెడిట్ లెటర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యకర్తకు కష్టం వచ్చినప్పుడు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, ఏఎంసీ చైర్మన్ కురువ మల్లయ్య, టౌన్ బ్యాంకు చైర్మన్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు భాస్కర్ చంద్రశేఖర్, మండల, పట్టణ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వ్యాపారవేత్తలకు రుణ ప్రోత్సాహం

**బాపట్లలో మెగా లోన్ మేళా. 288 మంది సభ్యుల దరఖాస్తులు**



**బాపట్ల సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన్ ఫ్యామిలీ,వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా బాపట్లలో మెగా లోన్ మేళా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా, పురపాలక సంఘం ఆధ్వర్యంలో బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.బాపట్ల, చీరాల, రేపల్లె పురపాలక సంఘాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులను కార్యక్రమానికి ఆహ్వానించగా 288 మంది ఆసక్తి చూపారు. వివిధ స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం దాదాపు రూ.44 కోట్ల విలువైన రుణాలకు దరఖాస్తులు సమర్పించారు. రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు మేనేజర్లు అందించిన శాంక్షన్ లెటర్లను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్కుమాళ్ల ఆనంద్ సత్యపాల్ లబ్ధిదారులకు అందజేశారు.మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక ప్రాజెక్టులపై కూడా అవగాహన కల్పించారు. అరకు కాఫీ, మిషన్ ఎంబ్రాయిడరీ, మిస్ బర్గర్, మోమో నెస్ట్, తృప్తి క్యాంటీన్స్ వంటి ఫ్రాంచైజీ ప్రాజెక్టులు కార్యక్రమంలో పాల్గొని, ఆసక్తి ఉన్న సభ్యులకు రుణ సదుపాయాలపై మార్గదర్శకత్వం అందించాయి.ఈ కార్యక్రమంలో సీఎంఎంలు, సీఓలు, డీపీఎంయూ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జనసేనాని జన్మదిన వేడుకలు

**డిప్యూటీ సీఎం పుట్టినరోజు సందర్భంగా మొక్కలు పంపిణి చేసిన ప్రధాన కార్యదర్శి సంజయ్**

**స్థానిక టీడీపీ కార్యాలయంలో కూడా డిప్యూటీ సీఎం పుట్టినరోజు వేడుకలు**




**వేలేరుపాడు : 03 సెప్టెంబర్ వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** వేలేరుపాడులోని భూదేవిపేట జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో మేచినేని సంజయ్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం రోజున అంగరంగ వైభవంగ జరిగాయి,మొదట వేలేరుపాడు నుండి పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్లి ఎమ్మెల్యే చిర్రి బాలరాజుని కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు, తరువాత ఎమ్మెల్యే కాన్వాయ్ తో టీ నర్సాపురం ర్యాలీ గా వెళ్లడం జరిగింది, తధనానంతరం స్థానిక కళ్యాణ మండపం లో ఎమ్మెల్యే తో కలిసి కేక్ కటింగ్ లో పాల్గొని వచ్చి, భూదేవిపేటలో జనసేన కార్యకర్తలు, టీడీపీ, బీజేపీ నాయకులు కార్యకర్తల, మీడియా మిత్రుల మధ్యన కూటమి నాయకులతో, జనసేన కార్యకర్తలతో కేక్ కట్ చేసి, బాణా సంచా కాల్చి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులకు పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేయండం జరిగింది, మరియు ఈ పుట్టినరోజు వేడుకలను మండల వ్యాప్తంగా అభిమానులు జరుపుకోవడం జరిగింది, రేపాకగోమ్ము, యర్రబోరు, శివాకాశీపురం, మల్లారం పూచిరాల కాలనీ లో అంగరంగ వైభవంగా ఉపముఖ్యమంత్రి పుట్టినరోజు రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు మేచినేని సంజయ్, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పసుపులేటి లక్ష్మయ్య, బీజేపీ మండల అధ్యక్షులు ఓలేటి బాలకృష్ణ,వాసిరెడ్డి జగన్, లాయర్ గంగాధర్, జనసేన నాయకులు భేతి శివ మొదలైన వారి చేతులు మీదుగా ప్రజలకు మొక్కల్ని అందించడం జరిగింది, మేచినేని సంజయ్ మాట్లాడుతూ మన ఉప ముఖ్యమంత్రి ఆదేశాలకు ఆశయాలకు అనుగుణంగా ఈరోజు ఇంత పెద్ద కార్యక్రమం జరిపామన్నారు, పవన్కళ్యాణ్ ముఖ్యంగా పర్యావరణ, అటవీ శాఖ ల మీద మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి నే ధ్యేయంగా పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాట పట్టిస్తున్నారని, ప్రతి ఒక్కరు కూడా మొక్కల్ని నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని హితవు పలికారు, తరువాత వేలేరుపాడులోని స్థానిక టీడీపీ కార్యాలయం లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం కి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి రాధా కృష్ణ, కురిమెళ్ల కృష్ణ,జనసేన నాయకులు బద్దుల శివరామ్, చంటి, కోడూరి నాగేశ్వరావు, ప్రవీణ్, కమ్మచిచ్చు సీతయ్య, సాయి కిరణ్,వినోద్, సీ హెచ్ వెంకన్న, కే, సాయి సతీష్,సుధీర్, వంశీ, శంకర్, గణేష్, టీడీపీ నాయకులు సత్యనారాయణ, అనిల్, అంజి, సలీమ్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏ యస్ పి. హేమంత్



**చింతూరు సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి** డిజిటల్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏ ఎస్ పి హేమంత్ నిమ్మల గూడెం గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో పేర్కొన్నారు. అలాగే మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తుమ్మల గ్రామంలో గురువారం మహిళల భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు. పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మొబైల్ వాడకం పెరిగిన కొద్ది మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను, విద్యార్థినులను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ కొంతమంది మోసగాళ్లు మొబైల్ ద్వారా మహిళలను ట్రాప్ చేసి మోసగిస్తారని మొబైల్ తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివారు ఎవరైనా మహిళలను అల్లరి పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. .మొబైల్ వాడకం పెరుగడం వల్ల మోసాలు కూడా అంతే స్థాయి లో పెరుగుతున్నాయన్నారు. మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో ఏ యస్ పి, సి ఐ లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేబ్రోలులో ఘోరం సరిహద్దు గోడ వివాదంలో ఒకరి హత్య.. తల్లి, కొడుకు అరెస్ట్!






**గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు స్వల్ప సరిహద్దు గోడ వివాదం ఒకరి ప్రాణం తీసింది. క్షణికావేశంలో చేసిన దాడి ఒకరిని బలితీసుకోగా, మరో కుటుంబాన్ని జైలు పాలు చేసింది. గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని చేబ్రోలు గ్రామం కొత్తపేటలో గురువారం జరిగిన ఈ ఘోర ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించారు.

## వివాదానికి దారితీసిన సరిహద్దు గోడ

పోలీసుల కథనం ప్రకారం.. చేబ్రోలు గ్రామానికి చెందిన వులవకాయల సత్తిబాబుకు, అదే గ్రామంలో నివసిస్తున్న దూళిపూడి యేసమ్మ, ఆమె కుమారుడు మహేష్‌లకు మధ్య కొంతకాలంగా ఇంటి సరిహద్దు గోడ విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఇరువర్గాల మధ్య మళ్లీ మాటల యుద్ధం నడిచింది. వివాదం కాస్తా ముదరడంతో ఇరుపక్షాలు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యాయి. మాటల తూటాలు పేలుతున్న సమయంలో తల్లి దూళిపూడి యేసమ్మ (41) తన కుమారుడు మహేష్‌ను సత్తిబాబుపైకి రెచ్చగొట్టింది. తల్లి మాటలతో తీవ్ర ఆగ్రహానికి గురైన కుమారుడు దూళిపూడి మహేష్ (19) విచక్షణారహితంగా వులవకాయల సత్తిబాబుపై దాడికి తెగబడ్డాడు. పిడిగుద్దులు, గట్టి దెబ్బలతో సత్తిబాబును తీవ్రంగా కొట్టాడు. ఈ ఊహించని దాడికి, దెబ్బల తాకిడికి తాళలేక సత్తిబాబు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. సత్తిబాబు మరణించాడని గ్రహించిన తల్లి, కొడుకు ఇద్దరూ భయంతో అక్కడి నుంచి వెంటనే పరారయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న పిఠాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తమ కోసం తీవ్రంగా వెతుకుతున్నారనే విషయం తెలుసుకున్న నిందితులు దూళిపూడి మహేష్, అతని తల్లి యేసమ్మలు గురువారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో గొల్లప్రోలు సబ్ ఇన్స్పెక్టర్ నౌడ్ రామకృష్ణ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన ఇద్దరు నిందితులను పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. వారిపై హత్య కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# సమాజానికి నా వంతు సేవ

## సొంత ఖర్చులతో శవపేటికలు తయారు చేసి అందిస్తున్న లక్ష్మీపురం వాసి వాసంశెట్టి రామకృష్ణ



**ఎటపాక, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** సమాజానికి తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో ఓ కార్పెంటర్ గత పదేళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. కులమతాలకు అతీతంగా గ్రామంలో ఎవరైనా మృతి చెందితే, తన సొంత ఖర్చులతో శవపేటికకు అవసరమైన సామగ్రిని సమకూర్చి, స్వయంగా శవపేటికను తయారు చేసి మృతుల కుటుంబాలకు ఉచితంగా అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాసంశెట్టి రామకృష్ణ కార్పెంటర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. పేద కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు అంత్యక్రియల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను గమనించిన ఆయన, తన వంతుగా సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ఆలోచనతో సుమారు పదేళ్ల క్రితం ప్రారంభించిన ఈ సేవను నేటికీ కొనసాగిస్తున్నారు.గ్రామంలో ఎవరైనా మృతి చెందారని తెలిసిన వెంటనే తనకు చేతనైనంత సహాయం అందించేందుకు ముందుకు వస్తున్నారు. శవపేటిక తయారీకి కావాల్సిన కలప, ఇతర సామగ్రిని తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి, స్వయంగా శవపేటికను తయారు చేస్తారు. అనంతరం దానిని మృతుల ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అందజేస్తూ అంత్యక్రియలకు అండగా నిలుస్తున్నారు. ఈ సేవలో కులం, మతం, ఆర్థిక స్థితిగతులు వంటి భేదాలకు తావివ్వకుండా అందరికీ సమానంగా సేవ చేయడం రామకృష్ణ ప్రత్యేకతగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆపద సమయంలో మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, తనకు తోచిన విధంగా సహాయం చేయడం అభినందనీయమని పలువురు కొనియాడుతున్నారు. సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందనడానికి రామకృష్ణ చేస్తున్న సేవే నిదర్శనమని, గ్రామస్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పదేళ్లుగా ఎలాంటి ప్రచారం ఆశించకుండా తన సొంత ఖర్చులతో ఈ సేవ కొనసాగిస్తున్న వాసంశెట్టి రామకృష్ణను పలువురు అభినందిస్తున్నారు.

# చేతి వేళ్ళు లేని వృద్ధురాలకు రేషన్ బియ్యం అందించాలని విన్నవించిన పట్టించుకోని వీఆర్వో త్రివేణి, సి ఎస్ డి టి సుబ్బలక్ష్మి



**గుంతకల్లు సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్ గంట చర్చి దగ్గరలో నివాసం ఉంటున్న వృద్ధురాలు షేక్ అమ్మని కి ఈమె కంటూ నా అన్న వారు ఎవరు దగ్గర లేరు, ఈమె చేతి వేళ్ళు లేవు గత 2సంవత్సరాలుగా స్టోర్ బియ్యం తీసుకోవడం లో చాలా ఇబ్బంది పడుతుంది. స్టోర్ డీలర్లు తంబు (వేలి ముద్ర )పడితే గాని బియ్యం ఇవ్వమని చెబుతున్నారు. ఐరిష్ మిషన్ స్టోర్ లో లేని కారనంగా ప్రతి నెల ఇబ్బంది పడుతుందని 32 వ వార్డు మాజీ కౌన్సిలర్ వై సుధాకర్ తనకు పరిచయం ఉన్న స్టోర్ డిలర్లను రిక్వెస్ట్ చేసుకొని ఒక్కో నెల ఒక్కో స్టోర్ లో ఇప్పటి వరకు ఏదోలా రేషన్ బియ్యం ఇప్పిస్తున్నారు. కానీ ఈమె ప్రతినెల ఒక స్టోర్ కు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతు న్నారని ఈమె సమస్య పరిష్కారం చూపమని సంబంధిత సచివాలయం లో వీఆర్వో కి ఎన్ని సార్లు చెప్పిన నా పరిధిలో లేదు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. రెవిన్యూ అధికారులకు విన్నవిస్తే చేస్తాం చూస్తాం చెప్తాం అంటూ కాలం వెల్లడిస్తు న్నారు. వీలైనంత వరకు ఆమెకు సహకరిస్తున్న కానీ, ఈమె సమస్య ఎలా పరిష్కారం చేయాలో అర్థం కావడం లేదు పరిస్కారం చూపాల్సిన వీఆర్వో త్రివేణి, సి ఎస్ డి టి సుబ్బలక్ష్మి అసలు పట్టించుకోవడం లేదు, అధికారులు పట్టించు కోవడం లేదని సుధాకర్ ఆవేదన చెందుతూ ఈ వృద్దురాలు దినమైన పరిస్థితి ని సహృదయం తో అర్థం చేసుకుని కలెక్టర్ కి ఈ విషయం తెలిసి ఈమెకు న్యాయం జరిగేలా చూడాలని సుధాకర్ కోరుతున్నారు.

# సుబ్బారెడ్డి సాగర్ నీటిని పొదుపుగా వినియోగించాలి

**--పశువులు,తాగునీటి అవసరాలకే పరిమితం చేయాలి..**

**--కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పేర్కొన్న ఎమ్మార్వో ఎం సూర్యప్రభ,ఏవో జోకా అమృత**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**ప్రత్తిపాడు మండలం గోకవరం గ్రామంలోని సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచించారు.కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారి ఎం సూర్యప్రభ,మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు.ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పశువుల అవసరాలు తాగునీటి అవసరాల మేరకు మాత్రమే నీటిని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ అధికారులకు సూచించారు.ఈ సమాచారాన్ని తమ పరిధిలోని గ్రామాలకు చేరవేసి,నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఇందులో భాగంగా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం,వేములపాలెం గ్రామాల్లోనూ ఏవో జోకా అమృత ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రస్తుత నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. రైతులు ఆరుతడి పంటలు కానీ,పిఎండిఎస్ పంటలు వేసికోవాలని సూచించారు.

# మల్లవరంలో వైభవంగా గ్రామసభ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం!

**ఒక నెల నాలుగు సందర్శన'లో భాగంగా కార్యక్రమం.సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ఎంపీడీఓ సెలెట్ రాజు, తహసీల్దార్ వెంకట భాస్కర్ హామీ!**






**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చే లక్ష్యంతో గొల్లప్రోలు మండలం మల్లవరం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక నెల నాలుగు సందర్శన" కార్యక్రమంలో భాగంగా ఈ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు గ్రామం నలుమూలల నుంచి ప్రజలు తమ దీర్ఘకాలిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.గ్రామస్తుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని పరిష్కరించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఒకే వేదికపైకి వచ్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ , హౌసింగ్ ఆర్‌డబ్ల్యూఎస్ తదితర ముఖ్య శాఖల ఉన్నతాధికారులు ఈ సభకు హాజరయ్యారు. అధికారులు ప్రజలతో నేరుగా ముఖాముఖి మాట్లాడి, వారి అర్జీలను స్వీకరించారు. ఈ గ్రామసభలో మొత్తం 11 దరఖాస్తులు అధికారులకు అందాయి. ఇందులో అత్యధికంగా భూములకు సంబంధించిన సమస్యలే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్వీకరించిన దరఖాస్తుల వివరాలు చూస్తే..భూ సర్వే దరఖాస్తులు: 08,నీటిపారుదల దరఖాస్తులు: 01,రక్షిత మంచినీటి సరఫరా: 01,పాడా దరఖాస్తులు: 01. ఈ సందర్భంగా ఎంపీడీఓ సెలెట్ రాజు, తహసీల్దార్ వెంకట భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఇలాంటి గ్రామసభలు ఎంతగానో ఉపయోగపడతాయ న్నారు. మల్లవరం గ్రామసభలో అందిన ప్రతి ఒక్క దరఖాస్తును సంబంధిత శాఖల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

# పిఠాపురంలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

## పాదగయా క్షేత్రంలో దివ్యాంగుల ప్రత్యేక పూజలు



**పిఠాపురం (ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు పిఠాపురం నియోజకవర్గంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాదగయా క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం దివ్యాంగులు ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను దివ్యాంగులు తమ పాలిట దేవుడిగా కొనియాడారు. ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలందించాలని కాంక్షిస్తూ పాదగయా క్షేత్రంలో స్వామివారికి దివ్యాంగులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

**దివ్యాంగుల సంక్షేమానికి పవన్ కళ్యాణ్ నిరంతర కృషి: మేడిశెట్టి నాగమణి**

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకురాలు మేడిశెట్టి నాగమణి మాట్లాడుతూ.. పిఠాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధితో పాటు, సమాజంలో వెనుకబడిన దివ్యాంగుల సంక్షేమం, హక్కుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో పిఠాపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజున దివ్యాంగులంతా కలిసికట్టుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు, పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వేడుకల్లో దివ్యాంగుల సంఘాల నాయకులు కోళ్ల శ్రీనివాస్, అడ్డాల ప్రకాష్, చందు, రాంబాబు, పేపకాయల వరప్రసాద్, ఆర్. లక్ష్మి, జ్యోతి, షేక్ బేబీ, హావిష్‌లతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు జ్ఞాన స్ఫూర్తిదాత సర్వేపల్లి

### - వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ( పార్లమెంట్ ) దుంపల రామారావు




**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** విద్యార్థుల కోసం తన జీవిత కాలం తపించి సర్వేపల్లి రాధాకృష్ణ జ్ఞాన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ( పార్లమెంట్) రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురు పూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదియుగంనుండి ఆధునిక యుగం వరకు ఆయనే జీవన రుషి వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి,గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటిచెప్పిన మన దేశ రెండో రాష్ట్రపతి,మేధావి ,విద్యావేత్త అని పేర్కొన్నారు. గురువు అంటే అజ్ఞాన పొరలు తొలగించి జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయుడే అని కొనియాడారు.విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణంలో గురువు పాత్ర కీలకమని అన్నారు.ఉపాధ్యాయులకు ఉన్న గురుతర బాధ్యతను ఎప్పటికీ విస్మరించకూడద న్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కృషి ఎనలేనిదని తెలిపారు. అనంత రం జాతీయ స్థాయిలో ,ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు , వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మిన్నంటిన కృష్ణాష్టమి సంబరాలు




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** స్థానిక కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. పండుగను పురస్కరించుకుని పాఠశాల ఆవరణ మొత్తాన్ని రంగురంగుల పూలమాలలు, తోరణాలు మరియు సుందరమైన ముగ్గులతో నందగోకులాన్ని తలపించేలా అలంకరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఎల్‌కేజీ నుంచి ప్రాథమిక తరగతుల విద్యార్థులంతా శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలతో హాజరై అలరించారు. నెమలి పింఛాలు, చేతిలో పిల్లనగ్రోవులతో చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి కృష్ణులు చేసిన ప్రదర్శనలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన కృష్ణ లీలల నాటికలు, గోపికల నృత్యాలు మరియు భక్తి గీతాల ఆలపన పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపింది.వేడుకల్లో భాగంగా పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన 'ఉట్టి కొట్టే' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "గోవిందా.. గోపాలా.." అంటూ విద్యార్థులంతా ఉత్సాహంగా నినాదాలు చేస్తుండగా, విద్యార్థుల జట్లు పోటీపడి ఉట్టిని బద్దలు కొట్టాయి. ఈ దృశ్యం మైదానంలో ఉన్న వారందరిలోనూ ఎంతో జోష్ నింపింది.ఈ సందర్భంగా కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఆర్.అనురాధ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక విద్యతో పాటు పిల్లలకు మన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు నైతిక విలువలను నేర్పించడమే పాఠశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన కర్తవ్య బోధనను విద్యార్థులు చిన్నతనం నుంచే అలవాటు చేసుకుని, క్రమశిక్షణతో కూడిన ఉత్తమ జీవితాన్ని గడపాలని వారు ఆకాంక్షించారు.ఈ వేడుకల అనంతరం విద్యార్థులకు కృష్ణుడికి ఇష్టమైన వెన్న, అటుకులు మరియు ప్రసాదాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు పంపిణీ చేయడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దేవంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**తాళ్లపూడి, సెప్టెంబర్ 3,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను జనసేన నాయకులు కల్లూరు సుబ్రహ్మణ్యం, నామన చిన్న బూరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా గ్రామంలో జనసైనికులు భారీ కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని, జై జనసేన నినాదాలతో గ్రామం మార్మోగింది.ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ ప్రతి అడుగు వేస్తు. అధికారం కోసం కాకుండా, ప్రజల కోసం పనిచేసే నిజమైన నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు.ఎన్నో అవమానాలు, ఎన్నో కష్టాలు ఎదుర్కొని కూడా ప్రజల పక్షాన నిలబడిన గొప్ప వ్యక్తి అని రాష్ట్ర అభివృద్ధిలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందని అందులో ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా పల్లెల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు ఆయన ఆశయాలను సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు మేమంతా ఐకమత్యంగా కృషి చేస్తామన్నారు.పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారుఈ కార్యక్రమంలో కోడి శంకరం, సాయిన సుబ్బారావు,ముప్పన పల్లి వీరబాబు, సిద్ధంశెట్టి స్వామి,పెనుకుర్తి మణి,గంగిరేజి దివాకర్,కోడి పవన్ ,నాగిరెడ్డి మణి,గంటా శ్రీను,మద్దుకూరి గంగయ్య, గాంధీ, బోడపాటి సాయికృష్ణ, జవ్వాది మణి,గెడ్డం విజయ భాస్కర్,పసలపూడి ప్రసాద్ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు

## ధర్మవరంలో మురళీ కృష్ణంరాజు పరామర్శలు

### --అకాల మరణం చెందిన కుటుంబాలకు ఆర్థికసాయం..

### --అనారోగ్యంతో ఉన్న బాబ్జీకి పరామర్శ



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన ఐయినవిల్లి చిన్నబ్బాయి, అనసూరి చిట్టిబాబు కుటుంబాలను మురళీ కృష్ణంరాజు పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.నిరుపేద కుటుంబాలకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. అలాగే బొల్లు సత్తాలు భార్య బుచ్చిరాజు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రాందేవ్ బాబ్జీని మురళీ కృష్ణంరాజు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో కోలా తాతబాబు,దాడి పుత్రయ్య,కాపారపు బుజ్జిబాబు,బూరా నానిబాబు,జెడ్డా శ్రీను దూలపల్లి మనేష్, శ్రీమంతుల జోగిరాజు,బూరా తాతాజీ,రాయుడు దొరబాబు, చిలకల పల్లి శ్రీను,అనసూరి రాంబాబు,నల్ల వెంకటేష్,కర్రి రాము తదితర నాయకులు పాల్గొన్నారు

## గంజాయి పాత ముద్దాయిలపై పెద్దాపురం పోలీసుల ఉక్కుపాదం

### --ఆరుగురిని అదుపులోకి సీఐ వైఆర్కె శ్రీనివాస్ తీసుకుని కౌన్సెలింగ్

### --సత్ప్రవర్తనకు బాండ్ ఓవర్




**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెద్దాపురం సీఐ వైఆర్కె శ్రీనివాస్ గంజాయి పాత కేసుల్లో నిందితులు, గంజాయి వినియోగించిన పాత నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగించారు.ఇందులో భాగంగా గురువారం ఆరుగురిని గుర్తించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు సక్రమంగా జీవనం సాగిస్తున్నారా? ఎలాంటి కార్యకలాపాల్లో ఉన్నారు? వారి ప్రవర్తన ఎలా ఉంది? అనే అంశాలపై నిఘా పెట్టిన పోలీసులు,అనంతరం పెద్దాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి సత్ప్రవర్తనకు బాండ్ ఓవర్ చేయించారు."గంజాయి బ్యాచ్ అంటున్నారా.. అయితే జాడ చెప్పండి. ఊహలు కాదు.. సమాచారం కావాలి" అని పోలీసులు సూచించారు.ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని కాపాడాలని కోరారు.అయితే మద్యం సేవించే వారిని డ్రగ్ వినియోగదారులుగా పొరపాటుగా భావించవద్దని పోలీసులు సూచించారు.

## యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు.



**పాలకొల్లు ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 3.** పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిసోరి స్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలు. ఘనంగా జరిపారు. శ్రీకృష్ణుని వేషధారణలోను రాధమ్మ వేషధారణలో వేదిక పైకి వచ్చిన చిన్నారులు అందరిని అలరించారు. ఆ చిన్నారులలో ఉత్తమ వేషధారణ లో ఉన్నవనిత క్లబ్ సభ్యులు విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అనంతరం స్కూల్ లో పనిచేస్తున్న ఆయాలకు వనిత క్లబ్ తరపున చీరలు బహూకరించారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దేవరపు కాంచనమాల, యు కె యస్ సి ట్రైనర్ మద్దాల వాసు, మాంటిసోరిస్ ప్రిన్సిపల్ వసంత లక్ష్మి సెక్రటరీ సిద్ధిరెడ్డి శైలజ రాణి, ట్రెజరర్ తోట గాయత్రి, రీజనల్ చైర్ పర్సన్ మంగిన అరుణ వర్ధినిడి సుజాత మల్లిపూడి లక్ష్మి , అడబాల జ్యోతి కొత్తపల్లి పద్మ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

# నర్సు శిరీష హత్యపై నిరసన ర్యాలీ







### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

### శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

### శ్రీ భాస్కర విద్యానికేత్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల భారీ ర్యాలీ

**చింతూరు సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి** హైదరాబాద్ తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఆదివాసీ యువతి వుకే శిరీషపై జరిగిన ఘోర అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గురువారం శ్రీ భాస్కర విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిరసాని వేణుగోపాల్, ప్రిన్సిపాల్ వెల్పుల రాంబాబు మాట్లాడుతూ. సమాజానికి సేవలందించే నర్సు క్వార్టర్స్‌లోకి చొరబడి ఇంతటి దారుణానికి పాల్పడటం మానవత్వానికే మాయని మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలు,ముఖ్యంగా విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులు భయాందోళనలకు గురికాకుండా ప్రభుత్వం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.నర్సు శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఘటనకు బాధ్యుడైన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.మహిళల భద్రత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని పిలుపునిచ్చారు.ర్యాలీలో విద్యార్థులు,ఉపాధ్యాయులు మహిళల రక్షణకు సంబంధించిన నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ తాళ్లపూడి మండల బీసీ సెల్ ప్రెసిడెంట్ గా పెండెం పోసిబాబు నియామకం



**తాళ్లపూడి, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి న్యూస్** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాళ్లపూడి మండల బీసీ సెల్ ప్రెసిడెంట్ గా గజ్జరం గ్రామానికి చెందిన పెండెం పోసిబాబు ను నియమిస్తూ పార్టీ అధిష్టానం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి.ఈ నియామకంపై పోసిబాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి కొవ్వూరు నియోజకవర్గ ఇంచార్జ్ తలారి వెంకటరావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన గౌరవం ఏ పార్టీ ఇవ్వలేదు అని అన్నారు .జగనన్న హయాంలో బీసీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. ఆ నమ్మకాన్ని మరింత బలపరుస్తూ ప్రతి గ్రామంలో బీసీ సెల్ ను బలోపేతం చేస్తానన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి కార్యకర్తలను, నాయకులను, ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. పార్టీ బలోపేతానికి నా శాయశక్తులా కృషి చేస్తాను" అని అన్నారు.ఈ నియామకంపై మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోసిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు

# వినాయక మండపాలకు ఉచితంగా ఆన్‌లైన్ అనుమతులు

## సింగిల్ విండో విధానంలో సేవలు నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి ఎస్పీ అమిత్ బర్దార్

**ఎటపాక, సెప్టెంబర్ 3 (ప్రజాజ్యోతి):** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులకు ఎటువంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సింగిల్ విండో ఈ-పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఝఋఅవంష్ట్రబ్యిఝ.అవ్ ద్వారా మండపాల నిర్వాహకులు సులభంగా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎస్పీ శ్రీ అమిత్ బర్దార్, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో వినాయక ఉత్సవ కమిటీలు అనుమతుల కోసం ఎటువంటి అమౌంట్, ఫీజు లేదా చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సేవ పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు. అనుమతుల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం**

మండపం నిర్వాహకులు ముందుగా వెబ్‌సైట్‌లోకి వెళ్లి పై క్లిక్ చేయాలి. అనంతరం మొబైల్ నంబర్‌ను నమోదు చేసి ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాలి. దరఖాస్తు ఫారంలో నిర్వాహకుడి







పేరు, అసోసియేషన్ పేరు, విగ్రహ ప్రతిష్టాపన స్థలం, జిల్లా పేరు, సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు తదితర వివరాలను నమోదు చేయాలి. అలాగే ఐదుగురు కమిటీ సభ్యుల వివరాలు, విగ్రహ నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, నిమజ్జనానికి వినియోగించే వాహనం వివరాలను పొందుపరచాలి. ఫారం సమర్పించిన అనంతరం అప్లికేషన్ ఐడీ అందుతుంది. అనంతరం సింగిల్ విండో అధికారులు సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి వివరాలను పరిశీలిస్తారు. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత ద్వారా మొబైల్ నంబర్‌తో దరఖాస్తు స్థితిని తెలుసుకుని ఎన్‌ఓసీ, క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ఎన్‌ఓసీ, క్యూఆర్ కోడ్‌లను మండపం వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలి**

డౌన్‌లోడ్ చేసుకున్న ఎన్‌ఓసీ, క్యూఆర్ కోడ్‌లను లామినేషన్ చేయించి తప్పనిసరిగా గణేష్ మండపం గోడపై ప్రజలకు




కనిపించే విధంగా ప్రదర్శించాలని అధికారులు సూచించారు. ఎటువంటి రుసుము లేకుండానే అనుమతులు పొందుతూ, పోలీసుల సూచనలు మరియు నిబంధనలు పాటించి వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. కృష్ణ, ఎస్సై జి. అప్పలరాజు ఎటపాక మండల పరిధిలోని వినాయక చవితి ఉత్సవాల కమిటీల నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

# కేటీఆర్ మైండ్ గేమ్..

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేయని ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఊరూవాడ నిరసనలు చేపట్టాలని కూడా పిలుపునిచ్చారు. వ్యూహాత్మకంగా విసిరిన కేసీఆర్ రాజీనామా బాణాన్ని తట్టుకోవడం బీఆర్‌ఎస్‌కు తాత్కాలికంగా ఇబ్బందికర అంశమే అయినప్పటికీ, కేసీఆర్ మార్కు మైండ్ గేమ్‌లో ఇది కొత్తేమీ కాదు. ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారనే దాడిని రేవంత్ తీవ్రతరం చేయడాన్ని బీఆర్‌ఎస్ అధినాయకత్వం ఒక డైవర్షన్ ప్లాన్ గానే అభివర్ణిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన 1,000 రోజుల పాలనా కాలంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతుబంధు, రుణమాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ రీజూవినేషన్ వివాదాల నుండి ప్రజా దృష్టిని మళ్లించడానికే రేవంత్ ఈ వ్యక్తిగత విమర్శల ఎత్తుగడను ఎంచుకున్నారని హరీష్ రావు వంటి సీనియర్ నేతలు వెంటనే గళమెత్తారు. రేవంత్ సృష్టిస్తున్న ఈ నెగెటివ్ నారేటివ్‌ను బ్రేక్ చేయడానికి కేసీఆర్ ఇప్పటికే అంతర్గతంగా ఐదు అంచెల ప్రతివ్యూహాన్ని సిద్ధం చేసుకున్నారు.కేసీఆర్ అమలు చేయబోయే మొదటి ప్రతివ్యూహం తెలంగాణ ఆత్మగౌరవ కార్డు . తాను కేవలం ఒక రాజకీయ నాయకుడిని మాత్రమే కాదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన పితామహుడిననే భావన ప్రజల్లో ఇప్పటికీ ఉంది. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన నన్ను, కేవలం కొన్ని రోజుల సభలకు హాజరు కాలేదన్న సాకుతో రేవంత్ అవమానిస్తున్నారు అనే సెంటిమెంట్‌ను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం ద్వారా, రేవంత్ చేస్తున్న విమర్శలను తెలంగాణ సాధకుడిపై జరుగుతున్న దాడి గా మలచడం కేసీఆర్ మొదటి ఎత్తుగడ.రెండవది, ఎన్నికల సమయంలో ప్రచారానికి వస్తే రేవంత్ వేసిన పదవుల కోసం బయటకు వస్తున్నారు అనే ముద్ర వేస్తారు. దీన్ని చెరిపేసేందుకు సమయానుకూల రీ-ఎంట్రీ వ్యూహం బీఆర్‌ఎస్ ఖరారు చేసుకునే అవకాశం ఉంది. రేవంత్ సవాలు చేశారని లేదా కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందని వెంటనే రోడ్డుపైకి వస్తే, అది రేవంత్ గెలుపు కిందకే వస్తుంది. అందుకే ఈ నిరసనల వేడి చల్లారాక, సరైన రాజకీయ





వాతావరణం చూసుకుని భారీ బహిరంగ సభ ద్వారా కేసీఆర్ గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనున్నారు. తాను బయటకు వస్తే అది సొంత రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, కాంగ్రెస్ పాలనలో నష్టపోతున్న రైతులు, చేతివృత్తుల వారు, నిరుద్యోగుల సంక్షేమం కోసమేనని నిరూపించేలా కేసీఆర్ పర్యటనల రూట్ మ్యాప్ ఉండబోతోందిఅసెంబ్లీ డిబేట్‌ను ఆయుధంగా మార్చుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ గట్టి షాక్ ఇవ్వాలన్న ఆలోచనలో ఉంది. సెప్టెంబరులో జరగనున్న శాసనసభ సమావేశాలకు హాజరై, కాంగ్రెస్ ఎదుర్కొంటున్న వైఫల్యాలను, అమలు కాని హామీలను నేరుగా సభలోనే ఎండగట్టడం. రేవంత్ విసిరిన 1000 రోజుల పాలన సవాలును స్వీకరించి, సభ సాక్షిగా గణాంకాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తే, రేవంత్ సృష్టించిన పనిచేయని నాయ కుడు అనే ముద్ర ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోతుందనేది కేసీఆర్ నమ్మకం. రేవంత్ రెడ్డి విసురుతున్న వ్యక్తిగత విమర్శ లకు నేరుగా కేసీఆర్ సమాధానం ఇవ్వకుండా, కేటీఆర్, హరీష్ రావులను రేవంత్‌పైకి దాడికి దింపడం. ప్రభుత్వంపై ఉన్న ప్రజాగ్రహాన్ని ప్రతిబింబించేలా రోడ్ల మీదకు కేడర్‌ను తరలించడం ద్వారా కాంగ్రెస్ చేస్తున్న కేసీఆర్ రాజీనామా ఆందోళనలను కౌంటర్ చేయడం ఇప్పటికే ప్రారంభమైంది రేవంత్ రెడ్డి ఆడుతున్నది దూకుడుతో కూడిన పొలిటికల్ అఫెన్సివ్ గేమ్ అయితే, కేసీఆర్ అనుసరిస్తున్నది ఆయన మార్క్ స్ట్రాటజిక్ సైలెన్స్ వ్యూహం. కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత పరాకాష్టకు చేరే వరకు వేచి చూసి, సరైన సమ యంలో ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి వేసిన ముద్రను తిప్పికొట్టడమే కేసీఆర్ ముందున్న అసలైన సవాలు.

# భవనాల్లో భద్రత డొల్ల

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని పలు బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలలో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలు నగర ప్రజల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తించాయి. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల విభాగం సంయుక్తంగా రంగంలోకి దిగుతున్నాయి. నగరంలోని ప్రైవేట్, కమర్షియల్ మరియు రెసిడెన్షియల్ ఆకాశహర్మ్యాలలో అగ్నిమాపక రక్షణ నిబంధనలు సరిగ్గా అమలు జరుగుతున్నాయో లేదో తేల్చేందుకు విస్తృతస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు.ఈ ఆకస్మిక తనిఖీలలో ప్రధానంగా భవనాలకు సంబంధించిన ఫైర్ నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ల చెల్లుబాటును పరిశీలించనున్నారు. అంతేకాకుండా, ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే స్పందించాల్సిన ఆటోమేటిక్ ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ హోస్ రీల్స్, అత్యవసర పంపులు సరైన కండిషన్‌లో పనిచేస్తున్నాయా లేదా అని గ్రౌండ్ లెవెల్‌లో చెక్ చేయనున్నారు. నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్‌ను



సక్రమంగా నిర్వహించని భవనాల యజమానులు మరియు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల కు తక్షణమే నోటీసులు జారీ చేయాలని యోచిస్తున్నారు అన్నింటికంటే ముఖ్యంగా, అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కేటాయించిన రెఫ్యూజ్ ఏరియా ల వినియోగంపై అధికారులు కఠినమైన దృష్టి సారించనున్నారు. జాతీయ భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ప్రతి కొన్ని అంతస్తుల మధ్య ఖాళీగా ఉంచాల్సిన ఈ స్థలాలను.. అనేక భవనాల్లో క్లబ్ హౌస్‌లుగా, వినోద కేంద్రాలుగా లేదా ఆఫీస్ స్పేస్‌లుగా నిబంధనలకు విరుద్ధంగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి అక్రమ రూపాంతరాలను గుర్తిస్తే, వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఫైర్ ఆఫీసర్లు సిద్ధమవుతున్నారు.ఈ విస్తృత తనిఖీల ద్వారా కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, హైరైజ్ అపార్ట్‌మెంట్ నివాసితులలో భద్రతా స్పృహను పెంపొందించడం కూడా అధికారుల ముఖ్య ఉద్దేశం. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు మెట్ల మార్గాలు పొగతో నిండిపోకుండా ఉంచడం, కనీసం ఏటా ఒకసారైనా మాక్ డ్రిల్స్ నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. చట్టపరమైన అనుమతులు పొందడంతో సరిపెట్టుకోకుండా, భద్రతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు ఆడిట్ చేసుకుంటేనే ఆకాశహర్మ్యాలలో నివాసం సురక్షితంగా ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి ధ్వజం**

**గోదావరిఖని**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో హామీలు అమలు చేయలేదని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జీఎం గార్డెన్‌లో "వ్యవసాయ విధ్వంసం?22ఏ" అంశంపై రైతు సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. "రైతు బాంధవుడు కేసీఆర్.. రైతు ద్రోహి రేవంత్ రెడ్డి" అని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతుబీమాపై నిర్లక్ష్యం వహించిందని, యూరియా?డీఏపీ కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. యూరియా బస్తా ?270కు రావాల్సి ఉండగా బ్లాక్‌లో ?500 వరకు కొనాల్సిన పరిస్థితి వచ్చిందని, వరి కొనుగోళ్లలో కోతలు విధిస్తున్నారని విమర్శించారు.కేసీఆర్ పాలనలో నీళ్లు, కరెంటు, రైతుబంధు, సకాలంలో ఎరువులతో పాటు భూముల విలువ కూడా పెరిగిందని, ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని హరీష్ రెడ్డి అన్నారు. రైతు కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం ఎంతోకాలం నిలవదని, రాబోయే ఎన్నికల్లో రైతులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేకల సమ్మయ్య యాదవ్, అల్లం నారాయణ, బండారి ప్రవీణ్, జహీద్ భాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, బక్కి కిషన్,చొప్పరి శ్రీనివాస్, సార్ల ఉదయ్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నూతి రాజకుమార్, కొండ సురేష్, పోయిల రవి, మేకల రామస్వామి, బొట్ల పోషం, గొర్రె శంకర్, గొర్రె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఐ .సి ప్రతిభ పోటీల్లో విజేతలు..

**జమ్మికుంట,** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంస్థను స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలోనూ, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరము కూడా ఎల్ఐసి వారోత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణములోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీ పరీక్షలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల (బాలికలు )లో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ గణేష్ ఆధ్వర్యంలో, డెవోలొప్మెంట్ ఆఫీసర్ ఏల్పుల రాజేందర్ క్విజ్ మాస్టర్ గా వ్యవహరించారు. 5 రౌండ్ల లో సాగిన ఈ పోటీలలో జమ్మికుంట సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్తులు వి.జస్వంత్, సిహెచ్.సాయి చరణ్, ప్రథమస్థానం. కాకతీయ హైస్కూల్ విద్యార్థులు వై.శ్రీకంఠసాయి, ఆర్ కౌస్తుబ్, ద్వితీయ స్థానం. విద్యోదయ విద్యార్థులు డి.అభిరూప్ లెనిన్,ఏ.రీత్విక్ లు తృతీయ స్థానం పొందారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి సతీష్ కుమార్ అభినందనలు తెలియజేయగా ఈ కార్యక్రమానికి మర్రి అవినాష్, సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్.ఓ.ఎఫ్.ఆర్., భూ సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి

**మంచిర్యాల :** జిల్లాలోని ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూ సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేద్దామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ?ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజనుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం భూ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు గిరిజనులకు సంబంధించిన భూ సమస్యలను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా కల్పించాల్సిన హక్కుల అమలు అంశాలపై చర్చించారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూములకు సంబంధించిన సమస్యలను పరిశీలించి క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా గిరిజనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని గిరిజనుల భూ హక్కుల పరిరక్షణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు.

## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కరీంనగర్** స్థానిక భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, భగవంతుడిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే సుఖసంతోషాలు, శాంతి కలుగుతాయని అన్నారు. దేశవ్యాప్తంగా జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, శ్రీకృష్ణాష్టమికి మరో పేరు జన్మాష్టమి అని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణ మహాత్మ్యం, శ్రీకృష్ణ లీలలను ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. చిన్నారులు బాలకృష్ణుని వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు

**హైదరాబాద్ :** గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోధా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,